teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక



తీన్మార్ మొల్కోల్లు
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మొల్కోల్లు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 298 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | సోమవారం 4 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


# మూడు రోజుల్లో భారీ వర్షాలు



ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## రైతులకు వాతావరణ శాఖ అలర్ట్

## ఏపీ, తెలంగాణల్లో ఈదురు గాలులతో కూడిన వానలు

తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్): ముద్ర తీరంలో ఏర్పడిన ఉత్తర-దక్షిణ ద్రోణి ఇప్పుడు దక్షిణ ఛత్తీస్గఢ్ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ. ఎత్తు వరకు విస్తరించి ఉందని. దీని ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షాలు కురవనుండగా.. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే వర్షాల సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అదే సమయంలో రాష్ట్రంలో రానున్న రెండు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగి తదుపరి మూడు రోజుల్లో క్రమేపి రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఈ భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వరి పంటలు కోసే సమయం కావడంతో రైతులు ధాన్యం తడవకుండా తగు జాత్రలు తీసుకోవాలని కోరింది. ఇక అటు ఏపీలోనూ రాబోయే మూడ్రోజుల పాటు వర్షాలు కురిసే - మిగతా 2లో

# ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ పరీక్ష

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య దేశవ్యాప్తంగా పరీక్ష
- 20 లక్షల మంది విద్యార్థుల హాజరు

2



# నేటి నుంచి తెలంగాణలో రైతు వారోత్సవాలు

- తాండూరులో నేడు వారోత్సవాల ప్రారంభం
- టీజీ ఆర్గానిక్ యాప్ ఆవిష్కరణ
- రోజుకో అంశంతో రైతు వారోత్సవాలు
- వ్యవసాయం, అనుబంధ రంగాలపై రైతులకు అవగాహన



తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి 9 తేదీ వరకు రైతు వారోత్సవాలు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ వారోత్సవాలు రైతుల ఇంటి వద్దకే చేరే కార్యక్రమంగా రూపొందించామని, రాబోయే వ్యవసాయ సీజన్‌కు రైతుల్లో నమ్మకం పెంపొందించేందుకు దోహదపడుతుందని వివరించారు. శాఖల - మిగతా 2లో



# కేసీఆర్‌కు మతిభ్రమించింది

- నాయకులను మోసం చేయడం ఆయనకు అలవాటు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేదు
- ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

2

# సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలకు ముహూర్తం ఖరారు




మే మూడో వారంలో ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్సీ) 12వ తరగతి ఫలితాల విడుదలకు ముహూర్తం ఫిక్స్ అయింది. అందిన సమాచారం మేరకు మే నెల మూడవ వారంలో ఫలితాలను వెల్లడించనున్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే 10వ తరగతి ఫలితాలను వెల్లడించిన సీబీఎస్సీ బోర్డు ఈ మేరకు 12వ తరగతి - మిగతా 2లో

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు కుట్ర

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- జీవో 7ను తక్షణమే వెనక్కి తీసుకోవాలి
- రూ.10 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 7ను తీసుకొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు అండగా ఉన్న ఈ పథకానికి పాతరేసేందుకు ప్రభుత్వం కుటిల ఎత్తుగడలు వేస్తోందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు. విద్యావ్యవస్థ విధ్వంసం: విద్యాశాఖను తన వద్దే పెట్టుకున్న సీఎం, రెండున్నరేళ్ల అసమర్థ పాలనలో - మిగతా 2లో





# ఓఆర్ఆర్ వాహనదారులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక

- ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు
- ఎమర్జెన్సీ అయితే తప్ప ఓఆర్ఆర్ పై వాహనాలు ఆపొద్దు



# ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్



- రైతులకు మద్దతుగా రాస్తారోకో, ధర్నా
- గత ప్రభుత్వ హయాంలోలాగే వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్ నేత హరీష్ రావు

హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫెయిల్ అయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఆదివారం జిల్లాలోని మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ జాతీయ రహదారిపై ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలనీ డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా - మిగతా 2లో

# మే నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

- మంజూరులో రాజకీయాలకు తావులేదు.. అర్హతే కొలమానం
- ప్రజల వద్దకే పాలన.. సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్
- మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయనున్నట్లుగా తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హతే కొలమానం అని, రాజకీయాలకు తావులేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ శ్రీజ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల - మిగతా 2లో

## నేటి నుంచి తెలంగాణలో 'రైతు వారోత్సవాలు





-మొదటిపేజీ తరువాయి
మధ్య సమన్వయం సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి రోజును ఒక ప్రత్యేక శాఖకు కేటాయించి కార్యక్రమాలు నిర్వహిస్తామని, మొదటి రోజు మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రెండో రోజు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పంటల విభిన్నీకరణ, మైక్రో ఇరిగేషన్ వంటి అంశాలపై కార్యక్రమాలు జరుగుతాయని, మూడో రోజు సహకార, మార్కెటింగ్ శాఖల ద్వారా మార్కెట్ లింకేజులు, రుణ సదుపాయాలపై వివరాలు అందిస్తామని పేర్కొన్నారు. నాలుగో రోజు యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, సౌర శక్తి పరిష్కారాలపై ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో రోజు పశుసంవర్ధక, మత్స్య శాఖలు పశు ఆరోగ్యం, చేపల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పిస్తాయని, చివరి రోజు సాగునీటి శాఖ వర్షాకాలానికి ముందస్తు చర్యలు, నీటి వనరుల నిర్వహణపై మార్గనిర్దేశనం చేస్తుందని వివరించారు. నేడు రైతు వారోత్సవాలను తాండూరులో ప్రారంభిస్తున్నామని, అదే విధంగా టీజీ ఆర్గానిక్యాప్‌ఆవిష్కరించి సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఒక పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రైతు వారోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు ఈ వారోత్సవాలలో ముఖ్య ఆకర్షణలుగా నిలుస్తాయని, రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలకు ముహూర్తం ఖరారు

-మొదటిపేజీ తరువాయి
ఫలితాలు కూడా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.12వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో చూడవచ్చు. వెబ్‌సైట్‌తో పాటు ఉమాంగ్ యాప్, డిజిలాకర్ ద్వారా కూడా ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 33 శాతం మార్కులు సాధిస్తేనే ఉత్తీర్ణత పొందినట్లు బోర్డు ప్రకటిస్తుంది. ఒకటి లేదా రెండు సబ్జెక్టులలో ఫెయిల్ అయిన వారు కంపార్ట్‌మెంట్ కేటగిరీ కిందకు వస్తారు. రెండు కంటే ఎక్కువ సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు వచ్చే ఏడాది మళ్లీ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ 10 వరకు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 18 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. గత సంవత్సరం, బోర్డు మే 13న ఫలితాలను ప్రకటించింది. డిజిటల్ మార్కింగ్ విధానంలో తప్పులు దొర్లాయంటూ వస్తున్న వదంతులపై పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ స్పందించారు. ఆన్‌లైన్ మూల్యాంకన ప్రక్రియ ఎటువంటి సమస్యలు లేకుండా సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సీబీఎస్సీ బోర్డు విద్యార్థుల జవాబు పత్రాలను తనిఖీ చేయడానికి ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానాన్ని ఈ ఏడాదే మొదటిసారిగా ఉపయోగిస్తుందని, ప్రస్తుతం మూల్యాంకనం ప్రక్రియ కొనసాగుతోందని, తుది పనులు పూర్తి చేసిన తర్వాత మే మూడవ వారంలో ఫలితాలను ప్రకటించాలని బోర్డు భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఓఆర్ఆర్ వాహనదారులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక



హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్):
ఔటర్ రింగ్ రోడ్డుపై ఇటీవల జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ అలర్ట్ అయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం వాహనదారులకు కీలక భద్రతా సూచనలు చేశారు. బ్రేక్ డౌన్ వంటి అనివార్య కారణాలు మినహా, ఓఆర్ఆర్ పై ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నిలపవద్దని సూచించారు. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాహనం ఆపాల్సి వస్తే, తక్షణమే 14449 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించి, తగిన భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాకే వాహనాన్ని ఎడమ వైపు చివరి లేన్‌లో నిలపాలని స్పష్టం చేశారు. ఈ జాగ్రత్తలు కేవలం ఓఆర్ఆర్ కే పరిమితం కాదని గుర్తించాలని, ఏ జాతీయ రహదారి పై ప్రయాణించేటప్పుడైనా ఈ నియమాలను విధిగా పాటించడం అత్యంత కీలకం అని తెలిపారు. ప్రతి సంస్థ కూడా తమ డ్రైవర్లకు, సిబ్బందికి ఈ భద్రతా ప్రోటోకాల్స్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఘోర రోడ్డు ప్రమాదాలను నివారించడానికి మనమందరం బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల నియంత్రణలో పోలీసులకు సహకరించి, మీ ప్రయాణాన్ని సురక్షితం చేసుకోవాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి రహదారిపై అకారణంగా వాహనాలు నిలిపే వారిపై కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మీ భద్రతే మా బాధ్యత. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండి.. అని కీలక సూచనలు చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు కుట్ర

-మొదటిపేజీ తరువాయి
విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని విమర్శించారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే సీఎం తన దగ్గర పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో మరణాలు: రాష్ట్రంలోని గురుకులాల్లో ఇప్పటికే 142 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ పథకానికే తూట్లు: నాడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ సీఎం వైఎస్సార్ సదుద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని, కేసీఆర్ తన హయాంలో రాజకీయాలకు అతీతంగా కొనసాగించారని గుర్తుచేశారు. సొంత పార్టీ తెచ్చిన పథకానికే తూట్లు పొడవడానికి ప్రభుత్వానికి సిగ్గనిపించడం లేదా అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
తల్లిదండ్రుల్లో ఆందోళన: జీవో 7 తెచ్చిన క్షణం నుంచి నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కంటిమీద కునుకు కరువైందని, పిల్లల భవిష్యత్తుపై ప్రభుత్వ చర్యలు నీళ్లు చల్లుతున్నాయని ఆరోపించారు.

**బీఆర్ఎస్ డిమాండ్లు, హెచ్చరికలు:**
విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్న ఈ 'చీకటి జీవో 7'ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, విద్యార్థులకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.
?ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకం గర్జిస్తే మంత్రులు రోడ్లపై తిరగలేరని హెచ్చరించారు. జీవో వెనక్కి తీసుకునే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## పోలీసు శాఖలో మొదలైన ప్రక్షాళన

**సైబరాబాద్‌లో 65 మంది సీఐల బదిలీ**
**కొత్త డీజీపీ ఎఫెక్ట్.. బాధ్యతలు చేపట్టిన మరుసటి స్థానచలనం**




హైదరాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ పగ్గాలు చేపట్టిన తర్వాతి రోజే పోలీస్ శాఖలో ప్రక్షాళన పర్వం మొదలైంది. క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు, పారదర్శకమైన పాలనను అందించడమే లక్ష్యంగా భారీ బదిలీలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యంత్రాంగంలో మార్పులు చేర్పులు జరుగుతాయని భావిస్తున్న తరుణంలో, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కీలక నిర్ణయం వెలువడింది. కమిషనరేట్ వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న 65 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ రెడ్డి ఈ బదిలీలకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. గత కొంతకాలంగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న వారిని, పరిపాలనా సౌలభ్యం కోసం మరియు పనితీరు ఆధారంగా కొత్త ప్రాంతాలకు కేటాయించినట్లుగా తెలుస్తోంది.

## కవిత పార్టీ వల్ల ప్రయోజనం లేదు

**సీఎం పదవి ఇవ్వలేదనే తండ్రితో విభేదాలు**
**నా దగ్గర 10 కోట్లు అడిగింది, కేసీఆర్ వల్లే ఇవ్వలేదు**
**కవిత పార్టీపై కేఏ పాల్ వ్యాఖ్యలు**



తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్):
కల్వకుంట్ల కవిత పెట్టిన పార్టీ వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన, సోషల్ మీడియా వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అమెరికా పర్యటన బిజీ కారణంగా ఇన్ని రోజులు తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. తండ్రి కేసీఆర్ తో వచ్చిన విభేదాల కారణంగానే కవిత కొత్త పార్టీని స్థాపించారని పాల్ తెలిపారు. గతంలో కవిత ముఖ్యమంత్రి పదవి అడిగితే కేసీఆర్ నిరాకరించారని ఆయన వెల్లడించారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ నిధుల కోసం రూ.10 కోట్లు అడిగారని గుర్తు చేశారు. అప్పట్లో తాను రూ. 15 కోట్లు ఇద్దామనుకున్నానని, కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో వెనక్కి తగ్గానని కామెంట్ చేశారు. కవిత పార్టీ వల్ల ఎవరికీ మేలు జరగదని, కేవలం తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే ఆమె ఆరాటపడుతున్నారని విమర్శించారు. మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు తాను డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానని కేఏ పాల్ తెలిపారు. ఈ యుద్ధం ఆగకపోతే ప్రపంచవ్యాప్తంగా 850 కోట్ల మంది ప్రజలు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. డొనాల్డ్ ట్రంప్ సహా పలు దేశాల ప్రతినిధులు తన సలహాలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. తానూ అప్పులు తీసుకురాగలనని, తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేయగలనని ధీమా వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా మేధావులు, సామాన్యులు అందరూ ప్రజాశాంతి పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

## కనిపించని వైసీపీ నేతలు

తిరుపతి
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. నెక్స్ట్ మేమే అంటూ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు ఇదే మాట చెబుతున్నారు. కానీ ప్రభుత్వ వైఫల్యాలపై మాత్రం ప్రశ్నించే నేతలు కరువవుతున్నారు. ఒకరిద్దరు నేతలు మాత్రమే స్పందిస్తున్నారు. విశాఖలో ఏదైనా పరిణామం జరిగితే గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతున్నారు. మిడిల్ ఆంధ్రాలో ఏదైనా జరిగితే అంబటి రాంబాబు, పేర్ని నాని లాంటి నేతలు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. రాయలసీమలో ఏమైనా జరిగితే నెల్లూరు జిల్లాకు చెందిన కాకాని గోవర్ధన్ రెడ్డి మీడియా ముందుకు వస్తున్నారు. మధ్యలో సజ్జల రామకృష్ణారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి కొన్ని అంశాలపై స్పందిస్తున్నారు. వారికి మించి ఎవరు ముందుకు రావడం లేదు. నిజంగా ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లోటు. గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో డీజిల్ అంశంపై పోరాటం చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ ప్రధాన నేతలు ఎవరు దీనికి హాజరు కాలేదు.

## మూడు రోజుల్లో భారీ వర్షాలు

-మొదటిపేజీ తరువాయి
అవకాశం కనిపిస్తోంది. ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రాబోయే మూడు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే వర్షాల సమయంలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని స్పష్టం చేసింది.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ పరీక్ష

తెలంగాణ బ్యూరో, మే 03 (తీన్మార్ న్యూస్):
దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ - 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈరోజు మధ్యాహ్నం రెండ గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ కోసం ఎన్‌టీఏ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేసి ఆ తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రెస్ కోడ్‌తోపాటు ఇతర నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అడ్మిట్ కార్డు, ఫొటో, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. విద్యార్థులకు 1.45 గంటలకు ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేసి, రెండు గంటలకు పరీక్ష ప్రారంభించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## మే నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి
చుట్టూ పదే పదే తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సేవలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళు _న్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో తీసుకున్న ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్నఈ ప్రజా దర్బార్‌లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడం ప్రజా ప్రభుత్వ బాధ్యత, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని చెప్పారు. ప్రజా దర్బార్‌లో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే పేదలకు ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం చిత్త శుద్ధితో లబ్దిదారులను ఎంపిక చేసి... వారికి ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. ఇప్పటికే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లలో సింహభాగం పూర్తయిన నేపథ్యంలో... మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడ అందిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరును చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మీద అబద్దాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సంకెళ్లు వేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రాజు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను రైతన్నలకు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రైతుపక్షపాతి ప్రభుత్వంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని... సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసాను ఎకరానికి 12 వేలకు పెంచి ఇస్తున్నామని చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి రైతువారోత్సవాలు నిర్వహిస్తున్నామని.. మే 5 , 6, 7 తేదీలలో వరంగల్ లో రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతన్నలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్

-మొదటిపేజీ తరువాయి
హరీశ్ రావు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. 28 రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. పొద్దుతిరుగుడు, మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు. వడ్లు పండించిన రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వడ్లు కొన్నట్లే.. ప్రస్తుతం కూడా వాటిని కొనుగోలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు సెంటర్లు ప్రారంభించినా.. ధాన్యం కొనుగోలు జరపడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. వడ్లు కొనుగోలు కోసం ఆందోళన చేస్తున్న రైతులు వడదెబ్బ కారణంగా వరి కుప్పలపై చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి రైతుబిడ్డ కాదని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

## కేసీఆర్‌కు మతిభ్రమించింది

నిజామాబాద్, మే 03 (తీన్మార్ న్యూస్):



నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని ఆయన ప్రకటించారు. పసుపు రైతులకు మంచి మద్దతు ధర లభిస్తోందంటే దానికి కారణం ప్రధాని మోదీ మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు మతిభ్రమించింది. నమ్మిన నాయకులను మోసం చేయడం ఆయనకు అలవాటు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డిని కూడా కేసీఆర్ మోసం చేస్తారు, కేసీఆర్ శకం ముగిసిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ స్థాయిలో మత్తు పదార్థాలను సరఫరా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేదు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా మరచిపోయారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను వారం రోజుల్లోగా కొనుగోలు చేయాలని బీజేపీ అల్టిమేటం జారీ చేసింది. సరైన సమయంలో కొనుగోళ్లు జరగకపోతే రాష్ట్రంలో రైతాంగం నుంచి పెద్దఎత్తున ఉద్యమం వస్తుంది' అని అన్నారు.

# ఎన్నికల ఫలితాలపై దేశమంతా సర్వత్రా ఉత్కంఠ

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సర్వే సంస్థలు ఫలితాలు వెల్లడించాయి. ఈ క్రమంలో గెలిచే పార్టీలు.. వాటి సీట్ల సంఖ్యపై పందాలు జోరందుకున్నాయి. అందరి చూపు పశ్చిమబెంగాల్, తమిళనాడు ఫలితాలపైనే. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో రిజల్ట్స్‌పై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. పందాలపై పోలీసుల నిఘా పెరగడంతో బెట్టింగ్ రాయుళ్లు రూట్ మార్చారు. ఐపీఎల్ తరహాలో ప్రత్యేక యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఫోన్ కాల్ అవసరం లేకుండా ఆర్థిక లావాదేవీల వివరాలన్నీ యాప్ ద్వారానే జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. పోటీ ఏదైనా.. ఎక్కడైనా.. బెట్టింగ్ ఖాయం అన్నట్టుగా మారిపోయింది పరిస్థితి. ఫలానా రాష్ట్రంలో.. ఫలానా పార్టీ అధికారంలోకి రాబోతుందని.. సదరు నియోజకవర్గంలో పలానా అభ్యర్థి గెలవబోతున్నారంటూ భారీగా పందాలు కాస్తున్నారు. వందకు వెయ్యి.. వెయ్యికి లక్ష అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందాలు కాస్తున్నారు. పెద్ద లీడర్లు తలపడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందన్న దానిపై పందాలు కాస్తున్నారు. ఎక్కడ ఎవరు గెలవబోతున్నారు.. అధికారంలోకి ఎవరు రాబోతున్నారు.. ప్రతీ గల్లీలో ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ నడుస్తోంది.

అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల 2026 శాసనసభ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం మే 4న ప్రకటించనుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించే ప్రామాణిక ప్రక్రియను అనుసరించి, సోమవారం సాయంత్రానికల్లా ఫలితం వెలువడే అవకాశం ఉంది.

**ఫలితాల తేదీ, సమయం:**

**తేదీ: మే 4, సోమవారం**

లెక్కింపు: ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.

తొలి ట్రెండ్స్: తొలి రెండు, మూడు గంటల్లోనే ట్రెండ్స్‌పై ఓ క్లారిటీ వస్తుంది

తుది ఫలితాలు: లెక్కింపు రౌండ్ల వేగాన్ని బట్టి, బహుశా మధ్యాహ్నం లేదా సాయంత్రానికి వెలువడే అవకాశం ఉంది.

ఓట్లను ఎలా లెక్కిస్తారు?

భారత ఎన్నికలలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సంఘం పర్యవేక్షణలో ఒక క్రమబద్ధమైన, దశలవారీ ప్రక్రియను అనుసరిస్తుంది. ఇది ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభమవుతుంది. ఈ బ్యాలెట్లను సర్వీస్



ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, దివ్యాంగులు వంటి నిర్దిష్ట వర్గాల వారు వేస్తారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ బ్యాలెట్లను మొదట లెక్కిస్తారు, ఆ తర్వాత ముందుకు వెళ్లే ముందు వాటి మొత్తం ఓట్లను నమోదు చేస్తారు. దీని తర్వాత, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు, ఈ ప్రక్రియ సాధారణంగా సుమారు 30 నిమిషాల తర్వాత ప్రారంభమవుతుంది. కాగితపు బ్యాలెట్‌ల వలె కాకుండా, అధికారులు, పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఫలితాల బటన్‌ను నొక్కినప్పుడు, జుఎవీలు ప్రతి అభ్యర్థికి నమోదైన మొత్తం ఓట్లను ప్రదర్శిస్తాయి. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం లెక్కింపులతో సహా అన్ని దశలు పూర్తయి, ధృవీకరించబడిన తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు.

**ఎలక్షన్ టాప్ నైన్ న్యూస్ దిగువన చూద్దాం..**

1) ఓట్ల లెక్కింపులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను సూపర్‌వైజర్లుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆదేశాలు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. కౌంటింగ్ సిబ్బందిని ఎంచుకునే స్వేచ్ఛ ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టం చేసింది. శనివారం సెలవు అయినప్పటికీ ఈ పిటిషన్ విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేకంగా సమావేశమైంది.

2) స్ట్రాంగ్ రూములల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తుండటంతో కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల సంఘం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బెంగాల్‌లో లెక్కింపు సందర్భంగా 165 మంది అదనపు కౌంటింగ్ పరిశీలలకులు, 77 మంది పోలీసు పరిశీలకులను నియమించింది.

3) గడిచిన రెండు నెలలుగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనుంది.

4) రెండొందలకు పైగా సీట్లలో విజయం సాధించబోతున్నామని ఎవీజ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పార్టీ శ్రేణులకు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లతో ఆమెతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి స్టాక్‌మార్కెట్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మమత తెలిపారు. 2021, 2024లోనూ ఇలాగే చేశారని మమత వివరించారు.

5) బెంగాల్‌లోని డైమండ్ హార్బార్, మగ్రాహాత్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ నిర్వహించారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ఓటర్లు ఓటు వేశారు. మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌ను ఎన్నికల అధికారులు వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.

6) బెంగాల్‌లో రీపోలింగ్ సందర్భంగా స్థానికులు భారీ ఆందోళన చేపట్టారు. ఎవీజ నేతలు బెదిరిస్తున్నారని స్థానికుల నిరసనకు దిగారు. ఇళ్లకు వచ్చి వాళ్లు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీకి ఓటెయ్యలేదన్న కోపంతో తమను బెదిరిస్తున్నారని తెలిపారు. రీపోలింగ్‌లో తమను ఓటెయ్యకుండా టీఎంసీ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు

7) పని ద్వారా బీజేపీ మళ్లీ గెలవలేదు కాబట్టే చోరీ ద్వారా తనను కాపాడుకుంటోందని అస్సాం పీసీసీ అధ్యక్షుడు గౌరవ్ గొగయ్ ఆరోపించారు. స్ట్రాంగ్ రూమ్స్ నిర్వహణలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. స్ట్రాంగ్ రూమ్స్ లోపల బీజేపీ కార్యకర్తలు ఉంటున్నారని గొగయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

8) తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు తాను గౌహతి వచ్చానని కర్నాటక డిప్యూటీ సీఎం ఙఖ శివకుమార్ తెలిపారు. అస్సాంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులతో ఆయన భేటీ అయ్యారు. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ కూడా గౌహతి వచ్చారు. ఎగ్జిట్ పోల్స్‌ను తాను నమ్మనని శివకుమార్ అన్నారు.


9) తమిళనాడులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లలో భద్రతను బలోపేతం చేయాలని ఎఖ పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అధవ అర్జున, చెన్నైలోన తమిళనాడు ఎన్నికల ప్రధానాధికారి అర్చనా పట్నాయక్‌ను కలిశారు. శ్రీరంగంలోని తమ పార్టీ కార్యాలయంపై దాడికి సంబంధించి కూడా ఎఖ ఫిర్యాదు చేసింది.

# భారత్ గిన్నిస్ రికార్డు

సముద్రపు నీటి అడుగునా అతిపెద్ద మువ్వన్నెల భారత జాతీయ జెండా రెపరెపలాడింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని రాధానగర్ బీచ్‌లో నిర్వహించిన ఈ అద్భుత విన్యాసంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు పుటల్లోకి భారత్ ఎక్కింది. ఈ విన్యాసం అంత ఆషామాషీగా జరగలేదు. సముద్ర జలాల అడుగున భారత జాతీయ జెండాను ప్రదర్శించేందుకు 223 మంది స్కూబా డైవర్లతో కూడిన టీమ్ ఏకకాలంలో సమన్వయంతో పనిచేసింది. ఈ విన్యాసపు విజయం కచ్చితత్వం, ధైర్యం, జాతీయతా భావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ అరుదైన విన్యాసంలో భారత నౌకాదళం, పోలీసు విభాగాల సిబ్బందితో పాటు ముగ్గురు స్కూలు పిల్లలు ఫతే జహాన్ సింగ్ (16), లావణ్య ఎయిర (15), రణ్ విజయ్ సింగ్ (14) కూడా పాల్గొన్నారు. ఈ రికార్డును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రిషి నాథ్ అధికారికంగా ధ్రువీకరించి, లెఫ్టినెంట్ గవర్నర్ డీకే జోషికి సర్టిఫికెట్‌ను అందజేశారు. భారత్‌ను అంతర్జాతీయ స్థాయి స్కూబా డైవింగ్ హబ్‌గా గుర్తించేలా చేయడం, అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

**సముద్ర గర్భంలో ఆవిష్కరించిన జెండా విశేషాలు**

సముద్ర గర్భంలో ఇంత పెద్ద సైజు జాతీయ జెండాను ఆవిష్కరించి గిన్నిస్ రికార్డును సృష్టించడం ఇదే తొలిసారి. 2026 మే 2న అండమాన్ నికోబార్ దీవుల్లోని ప్రఖ్యాత రాధానగర్ బీచ్‌లో ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. సముద్ర జలాల అడుగున ఆవిష్కరించిన భారత జాతీయ జెండా సైజు 2,400 చదరపు మీటర్లు. దీని పొడవు 60



మీటర్లు, వెడల్పు 40 మీటర్లు.

ఈ రికార్డును సృష్టించిన జెండాను పాలిస్టర్ మెటీరియల్‌తో తయారు చేయించారు. సముద్ర గర్భంలో జెండాను ఆవిష్కరించేటప్పుడు ఎదురయ్యే నీటి ఒత్తిడి, సముద్రపు అలల తాకిడిని తట్టుకోవడానికి, నీటిలో చిక్కుకోకుండా సాఫీగా విచ్చుకోవడానికి ఈ మెటీరియల్‌ను ఎంచుకున్నారు. పాలిస్టర్ మెటీరియల్‌తో తయారైనందున జెండా బరువు తక్కువే. అంతకుముందు కేవలం చేతితో వడికిన, చేతితో నేసిన ఖాదీ (కాటన్, సిల్క్, ఉన్ని) జెండాల ప్రదర్శనకు మాత్రమే అనుమతి ఉండేది. ఇప్పుడు మెషీన్ ద్వారా తయారైన పాలిస్టర్ జెండాలకు కూడా అనుమతి ఉంది.

భారత్ అసాధ్యాలను సుసాధ్యం చేస్తోంది : బీజేపీ

'ఇప్పుడు భారత్ కొత్త మైలురాళ్లను సాధించడమే కాకుండా, వాటికి సరికొత్త నిర్వచనం ఇస్తోంది. మొట్ట మొదటిసారిగా అండమాన్ నికోబార్ దీవుల్లో సముద్ర జలాల అడుగున అతిపెద్ద భారత జాతీయ జెండాను ఎగురవేయడం అద్భుతం. దీంతో మన దేశం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. సముద్రపు అలల కింద జాతీయ జెండాను ఆవిష్కరించడం అనేది భారత్ కచ్చితత్వం, ధైర్యం, జాతీయతా భావాలకు ఒక శక్తివంతమైన నిదర్శనం. ఇది ఒక రికార్డు మాత్రమే కాదు. నిరంతరం తన పరిమితులను అధిగమిస్తున్న బలమైన భారతదేశానికి ప్రతిబింబం. ఒకప్పుడు అసాధ్యం అనిపించిన వాటిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతదేశం సాధిస్తోంది. ప్రపంచం దృష్టిని ఆకర్షించే ప్రమాణాలను నెలకొల్పుతోంది' అని కొనియాడుతూ బీజేపీ ఒక ట్వీట్ చేసింది.

**సముద్రపు లోతుల్లో అతిపెద్ద త్రివర్ణ పతాకం**

'అండమాన్ సముద్రపు లోతుల్లో అతిపెద్ద త్రివర్ణ పతాకం తన వైభవాన్ని ప్రదర్శిస్తూ ప్రపంచ రికార్డును నెలకొల్పింది' అని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ వ్యాఖ్యానించారు. అండమాన్ నికోబార్ దీవుల్లోని సముద్ర గర్భంలో అతిపెద్ద భారత జాతీయ జెండాను ఆవిష్కరించారని ఢిల్లీకి చెందిన బీజేపీ నేత, మంత్రి పర్వేశ్ సాహిబ్ సింగ్ పేర్కొన్నారు. దీంతో మన దేశం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటును సాధించిందని తెలిపారు. ఇది మన దేశంలోని ప్రతీ పౌరుడికి గర్వకారణమని అన్నారు. ఇది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావానికి ఒక అద్భుతమైన ఉదాహరణ అని చెప్పారు. మన సైనికులు, యువత సామర్థ్యాలను ఈ విజయం ప్రతిబింబిస్తుందని వెల్లడించారు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారత్ 157 స్థానం

భారత్‌లో పత్రికా స్వేచ్ఛపై ఆందోళన వ్యక్తం చేసింది కాంగ్రెస్. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిక 2026లో భారత్ 157వ స్థానంలో ఉందని, ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా భారత్ పత్రికా స్వేచ్ఛ పరిస్థితిపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. స్వేచ్ఛాయుత పత్రిక ప్రజాస్వామ్యానికి గొంతుక అని, అయితే అది దాడికి గురవుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. అలాగే అధికారానికి నిజాన్ని చెప్పే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి కృషి చేసే పాత్రికేయులకు, గొంతుకలకు సంఘీభావం తెలిపింది.

"స్వేచ్ఛాయుత పత్రికా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి గొంతుక. కానీ నేడు ఆ గొంతుకపై దాడి జరుగుతోంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచిక 2026లో భారత్? 157వ స్థానంలో నిలిచింది. ఇది 'అత్యంత తీవ్రమైన' వర్గంలోకి వస్తుంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా, అధికారానికి నిజాన్ని చెబుతూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి పోరాడే ప్రతి నిర్భయ గొంతుకకు కాంగ్రెస్ పార్టీ దృఢంగా అండగా నిలుస్తుంది." మరోవైపు మీడియా స్వేచ్ఛ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీ-ూూపై తీవ్ర విమర్శలు చేశారు. స్వతంత్ర మీడియాను శిక్షిస్తామని, విధేయతకు ప్రతిఫలం దక్కుతుందని స్పష్టమైన సందేశం ఇస్తున్నాయని ధ్వజమెత్తారు. మీడియాలోని కొన్నివర్గాలు అధికార పార్టీకి వత్తాసు పలకటానికే పరిమితం అయ్యాయని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ మీడియా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖర్గే ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచిలో భారత్ స్థానం 2014 నుంచి తగ్గుతూ వస్తోందన్నారు. బీజేపీ హయాంలో ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచీలో భారత్ స్థానం స్థిరంగా తగ్గుతూ 157కు పడిపోయిందన్నారు. ఈ కఠోర సత్యాన్ని ఎదుర్కొనాల్సి ఉందన్నారు. ూూ మీడియా గొంతు నొక్కేందుకు రాజ్యాంగ సంస్థలను ఆయుధాలుగా వాడుకోవటం పెరిగిందని ఖర్గే విమర్శించారు. మీడియా స్వేచ్ఛ అంటే ప్రభుత్వ వాదనను ఎక్కువగా వినిపించి, దాని వైఫల్యాలను కప్పిపుచ్చుటం కాదన్నారు. పాలకవర్గాన్ని ప్రశ్నించటం, వారు చేసే పనులను పరిశీలించి, జవాబుదారీగా చేయటమే నిజమైన మీడియా స్వేచ్ఛ అని ఎక్స్ పోస్టులో ఖర్గే పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 దేశాల్లో చేపట్టిన సర్వేలో భారత్ 157వ స్థానంలో నిలిచింది. కాగా గతేడాది విడుదల చేసిన జాబితాలో భారత్? 151 స్థానంలో నిలవగా, ఈ ఏడాది మరో ఆరు స్థానాలు దిగజారింది. ఈ సారి జాబితాలో తొలి స్థానంలో నార్వే, ఆ తర్వాత నెదర్లాండ్స్, ఈస్టోనియా, డెన్మార్క్, స్వీడన్ దేశాలు ఉన్నాయి. ఇక చివర్లో సౌదీ అరేబియా, ఇరాన్, చైనా, ఉత్తర కొరియా ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో జర్నలిస్టులు, మీడియాకు ఉన్న భావ ప్రకటన స్వేచ్ఛ ఆధారంగా ఫ్రాన్స్ కేంద్రంగా పనిచేసే రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) అనే సంస్థ ఏటా వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌ను విడుదల చేస్తోంది. పత్రికా స్వేచ్ఛ పట్ల తమ నిబద్ధతను గౌరవించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు గుర్తు చేస్తూ మే 3న వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ డేను నిర్వహిస్తున్నారు. ఇది పత్రికా స్వేచ్ఛ, వృత్తిపరమైన నైతిక విలువలకు సంబంధించిన అంశాలపై మీడియా నిపుణులు ఆత్మపరిశీలన చేసుకునేలా చేస్తోంది. పత్రికా స్వేచ్ఛ ప్రాథమిక సూత్రాలు అమలు, ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ స్థితిని అంచనా వేయడానికి, మీడియా స్వాతంత్ర్యంపై జరుగుతున్న దాడుల నుంచి రక్షించడానికి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పాత్రికేయులకు నివాళులు అర్పిస్తారు. 1991 ఏప్రిల్ 29 నుంచి మే 3 వరకు నమీబియా రాజధాని విండ్‌హోక్‌లో ఆఫ్రికాలో పత్రికా స్వేచ్ఛ, స్వతంత్రం అనే అంశంపై యునెస్కో సెమినార్ నిర్వహించింది. మే 3న పత్రికల స్వేచ్ఛ కోసం కొన్ని సూత్రాలను ప్రతిపాదించగా, దాన్నే విండ్‌హోక్ డిక్లరేషన్‌గా పేర్కొంటారు. దీనికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఏటా మే 3న 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం'గా జరుపుకోవాలని 1993, డిసెంబరులో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. 1994 నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ విండ్‌హోక్ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను నిర్ధారించడానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇది ఆఫ్రికన్ పాత్రికేయులు, మీడియా నిపుణుల మధ్య జరిగిన భావాల మార్పిడి, ఆఫ్రికాతో పాటు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో పత్రికా స్వేచ్ఛ, స్వతంత్రత, బహుళత్వాలను పెంపొందించడానికి కృషి చేసింది.

## నిశాంత్ కుమార్ 'సద్భావ యాత్ర'



బిహార్ మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కుమారుడు, జేడీయూ నేత నిశాంత్ కుమార్ ఆదివారం సద్భావ యాత్రను ప్రారంభించారు. పట్నాలోని పార్టీ కార్యాలయం నుంచి ఈ యాత్రను ప్రారంభించారు. జేడీయూ పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలతో ప్రత్యక్షంగా కలిసేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. విలేకర్లతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'మేం ఈ యాత్రకు దీనికి సద్భావ యాత్ర అని పేరు పెట్టాం. దీని అర్థం అందరినీ కలుపుకొని వెళ్లడం. ధనికులు, పేదలు, దళితులు, అతి పేదలు, మైనారిటీల అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వెళ్లాలి. సమాజంలో పరస్పర ప్రేమ, ఐక్యత పెంపొందించడమే లక్ష్యం. మహాత్మా గాంధీ కూడా తన మొదటి సత్యాగ్రహాన్ని చంపారన్ నుంచే ప్రారంభించారు. మా నాన్నగారు కూడా తన యాత్రలన్నీ అక్కడి నుంచే చేశారు. అదే స్ఫూర్తితో తాను కూడా యాత్రను ప్రారంభిస్తున్నా. దీని ద్వార పార్టీ కార్యకర్తలను కలవడం, వారి అభిప్రాయాలు తెలుసుకోవడం అలాగే ప్రజల సమస్యలను వినడం దీని ఉద్దేశ్యం' అని నిశాంత్ కుమారు తెలిపారు.

**తండ్రి ఆశీర్వాదంతో యాత్ర ప్రారంభం**

ఈ యాత్ర పలు దశల్లో కొనసాగుతుంది. మొదటి దశ మే 3, 4 తేదీలలో బగాహా నుంచి ప్రారంభమవుతుంది. రెండో దశ చారిత్రాత్మక ప్రాంతమైన వైశాలి నుంచి మొదలవుతుంది. యాత్ర ప్రారంభానికి ముందు నిశాంత్ కుమార్, పట్నాలోని నివాసంలో నీతీశ్ కుమార్ ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత పార్టీ కార్యాలయానికి చేరుకుని యాత్రను ప్రారంభించారు. 2025 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నీతీశ్ కుమార్ ఉపయోగించిన ఆధునిక సౌకర్యాలతో కూడిన రథంలోనే నిశాంత్ కుమార్ యాత్ర చేయనున్నారు. ఈ సందర్భంగా జెడ్ కేటగిరీ భద్రత కల్పించారు. ఈ యాత్రలో యువ ఎమ్మెల్యేల బృందం కూడా పాల్గొంటోంది. వారిలో ఋతురాజ్, శుభానంద్ ముకేశ్, చేతన్ ఆనంద్, రుహేల్ రంజన్ ఉన్నారు. జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ కుష్వాహా, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు నిశాంత్‌తో కలిసి యాత్రలో పాల్గొంటున్నారు.

**నేతల అంచనాలు -భవిష్యత్ నాయకుడు**

జేడీయూ నేతలు నిశాంత్‌ను పార్టీ భవిష్యత్‌గా అభివర్ణిస్తున్నారు. ఈ యాత్ర ద్వారా నిశాంత్ కుమార్ గ్రౌండ్ స్థాయి పరిస్థితులను అర్థం చేసుకుంటారని జేడీయూ నేత శ్రవణ్ కుమార్ చెప్పారు. కార్యకర్తల డిమాండ్ మేరకే నిశాంత్ రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. మరో నేత జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్ మాట్లాడుతూ, ప్రజల్లో నిశాంత్‌పై భారీ అంచనాలు ఉన్నాయని, పార్టీ విధానాలను ప్రజలకు చేరవేస్తారని పేర్కొన్నారు. నీతీశ్ కుమార్ నిర్మించిన వారసత్వాన్ని కొనసాగించే నాయకుడిగా నిశాంత్ ఎదగాలని అన్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ చౌధరీ కూడా ఈ యాత్రపై పార్టీ కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహం ఉందని తెలిపారు. జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ కుష్వాహా ఈ యాత్ర ప్రజలతో నేరుగా మమేకం కావడానికి, వారి సమస్యలను పరిష్కరించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఇప్పటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్న నిశాంత్ కుమార్, నీతీశ్ రాజ్యసభకు నామినేషన్ దాఖలుచేసిన కొన్ని రోజుల తర్వాత రాజకీయాల్లో అడుగుపెట్టారు. మార్చి 8న అధికారికంగా జేడీయూలో పార్టీలో చేరారు. జేడీయూలో కీలక నాయకుడిగా ఎదుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన తర్వాత, జేడీయూ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు నిశాంత్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఈ సద్భావ యాత్ర ద్వారా ప్రజలతో మమేకమై, పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు.

## అస్సాంలో కాంగ్రెస్ అలర్ట్..



**డిస్పూర్:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ సమీపిస్తున్న తరుణంలో రాజకీయ రసవత్తర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో, తమ అభ్యర్థులను కాపాడుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం అప్రమత్తమైంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను కొట్టిపారేస్తూ, అస్సాంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది తామేనని ధీమా వ్యక్తం చేస్తోంది. బీజేపీ వల నుంచి అభ్యర్థులను కాపాడేందుకు ట్రబుల్ షూటర్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ సహా సీనియర్ నేతలను హుటాహుటిన రంగంలోకి దించింది.

**కాంగ్రెస్ క్యాంపులోకి బీజేపీ వల?**

ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీ తమ అభ్యర్థులను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తోందని డీకే శివకుమార్ ఆరోపించారు. శనివారం గౌహతిలో జరిగిన ఆరు పార్టీల ప్రతిపక్ష కూటమి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మార్పు కోరుకున్నారని, తమ అభ్యర్థులను కాపాడుకోవడానికి తాము పూర్తి అప్రమత్తంగా ఉన్నామని స్పష్టం చేశారు. బీజేపీకి గెలుపుపై నమ్మకం ఉంటే తమ నేతలను ఎందుకు సంప్రదిస్తుందని ఆయన సూటిగా ప్రశ్నించారు.

**ఎగ్జిట్ పోల్స్ అబద్ధం.. 75 సీట్లు మావే!**

ఎన్డీఏ కూటమికి 88 నుంచి 100 స్థానాలు వస్తాయన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఎగ్జిట్ పోల్స్ కేవలం అధికారులపై, ప్రతిపక్షాలపై ఒత్తిడి తెచ్చేందుకేనని విమర్శించారు. ప్రతిపక్ష కూటమి కచ్చితంగా 70 నుంచి 75 స్థానాలు (మొత్తం 126 సీట్లలో) గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కౌంటింగ్ రోజున అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, ఢిల్లీ, గౌహతిలలో ప్రత్యేక లీగల్ సెల్స్ ఏర్పాటు చేసినట్లు శివకుమార్ తెలిపారు.

**సీఎం రేసులో గౌరవ్ గొగోయ్?**

అస్సాం ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలక పాత్ర పోషించారని, రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తేల్చి చెప్పారు. మరోవైపు, రైజోర్ దళ్ చీఫ్ అఖిల్ గొగోయ్ మాట్లాడుతూ.. కూటమికి 70కి పైగా సీట్లు వస్తాయని, గౌరవ్ గొగోయ్ ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. ఎన్డీఏ గ్రాఫ్ పడిపోతోందని అస్సాం జాతీయ పరిషత్ అధ్యక్షుడు లూరిన్‌జ్యోతి గొగోయ్ సైతం వ్యాఖ్యానించారు.

తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

# పేద విద్యార్థులకు ఉన్నత విద్య మిథ్యేనా!

రెండు దశాబ్దాల క్రితం వరకు ఉన్నత విద్య చదవడం అనేది పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు తీరని కల. ముఖ్యంగా ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి విద్య కోర్సులు చదవాలంటే కుటుంబాలు ఆర్థికంగా తీవ్రంగా కుంగిపోవాల్సి వచ్చేది. కొంతమంది తల్లిదండ్రులు తమ ఆస్తులను అమ్మి పిల్లలను చదివించాల్సిన పరిస్థితులు ఉండేవి. ఆర్థికపరమైన కారణాలతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఆలోచనతో 2004లో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనే పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ఉన్నత విద్యారంగం దశాదిశను మార్చేసింది. లక్షలాది మంది పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో పాతకాలం నాటి కష్టాలు పునరావృతమై, పేదలకు ఉన్నత విద్య దూరమయ్యే దుస్థితి నెలకొన్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం ఉన్నత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు రూపాయి ఖర్చు లేకుండా ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి, వివిధ రంగాల్లో రాణించడంతో తమ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కారణమయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసింది. తొమ్మిదిన్నరేండ్లలో దాదాపు రూ.15 వేల కోట్లకుపైగా చెల్లింపులు చేసింది. తెలంగాణలో ఐటీ రంగం అభివృద్ధి చెందడంలో ఈ పథకం ముఖ్యపాత్ర పోషించింది. హైదరాబాద్ నగరం ఐటీ హబ్‌గా ఎదిగింది. దాని ఆధారంగా రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివద్ధి చెందింది. ఈ సంక్షేమ పథకం ద్వారా రూపుదిద్దుకున్న నైపుణ్యం కలిగిన పట్టభద్రుల లభ్యత వల్ల ఇవన్నీ పరోక్షంగా సాధ్యమయ్యాయి. ఫలితంగా రాష్ట్ర తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది.తెలంగాణ వార్తలు నేటికి దాదాపు రూ.10 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. చిన్న మొత్తాల్లో బకాయిలు ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాలలకు కూడా ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఫలితంగా ప్రస్తుతం ఉన్నత విద్యా వ్యవస్థలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నెలకొంది. ప్రభుత్వం నుంచి చెల్లింపులు రాకపోవడంతో కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. మరోవైపు విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు పొందలేని పరిస్థితి నెలకొంది. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపే సమస్య. ఉన్నత విద్య పూర్తి చేసి విదేశాలకు వెళ్లాలని, ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆశించిన విద్యార్థులు ఇప్పుడు అయోమయంలో ఉన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వడానికి విద్యాసంస్థలు నిరాకరిస్తుండడంతో లక్షలాది మంది ఉన్నత విద్యావంతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఇటీవల ఫీజులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు మరింత ఆందోళన కలిగించే అంశం. ఇది విద్యార్థులకు అనుకూలమైన నిర్ణయమని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్తున్నప్పటికీ, వాస్తవానికి ఇప్పటికే పేరుకుపోయిన బకాయిల భారం విద్యార్థులపై మోపే ప్రయత్నమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే తమ బకాయిలను విద్యార్థుల నుంచే వసూలు చేసుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామనడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇటు హైకోర్టు, అటు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల దగ్గర నుంచే ఫీజులు వసూలు చేసుకోవాలని సూచించడం వల్ల కళాశాలలు తమ బకాయిల కోసం విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే చాలా కళాశాలలు పూర్తి ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని షరతులు విధిస్తున్నాయి. దీని వల్ల పేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. కొందరు తల్లిదండ్రులు అప్పులు చేసి, బంగారం తాకట్టు పెట్టి (పుస్తెల తాడు సహా) ఫీజులు చెల్లిస్తున్నారు. ఇది మళ్లీ రెండు దశాబ్దాల క్రితం పరిస్థితులను గుర్తుకుతెస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యను దూరం చేసే దిశగా అడుగులు వేస్తున్నదనే అనుమానం కలుగుతున్నది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజులు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో అనేక విద్యాసంస్థలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డిగ్రీ, జూనియర్ కళాశాలలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఉదాహరణకు, మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో ఒకప్పుడు 130కి పైగా ఉన్న డిగ్రీ కళాశాలలు ఇప్పుడు 30కు తగ్గిపోయాయి. అందులో కూడా అనేక కళాశాలలు మూతపడే దుస్థితిలో ఉన్నాయి. ఇది ఉన్నత విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభానికి స్పష్టమైన సంకేతం. ఇటీవల విద్యాసంస్థలు, విద్యార్థి సంఘాలు కలిసి ఉద్యమాలకు దిగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. కళాశాలల బంద్‌లు, పరీక్షల బహిష్కరణ, ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చాయి. అయినప్పటికీ సమస్యకు స్పష్టమైన పరిష్కారం కనిపించడం లేదు. పైగా పథకాన్ని మరింత గందరగోళంలోకి నెట్టే నిర్ణయాలు తీసుకుంటున్నట్టు కనిపిస్తున్నది. విద్యార్థుల బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం స్పష్టమవుతున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బలహీనపరచడం లేదా ఎత్తివేయడం వంటి చర్యలు తీసుకుంటే, అది సామాజికంగా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య మరలా అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉన్నది. ఇప్పుడిప్పుడే ఉన్నత చదువులు పూర్తి చేసి విదేశాలకు వెళ్లాలని, మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆశపడుతున్న విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలి. ట్యూషన్ ఫీజులను విద్యార్థుల నుంచే వసూలు చేయాలనే విధానాన్ని పునఃసమీక్షించి, పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలి. అలాగే దీర్ఘకాలికంగా ఈ పథకాన్ని స్థిరంగా కొనసాగించే విధానాలను రూపొందించాలి. ఫీజురియింబర్స్‌మెంట్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదు. సమాజంలో సమానత్వాన్ని సాధించే ఒక ముఖ్య సాధనం. అంటే, పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికపరమైన కారణాలతో ఉన్నత విద్యకు దూరం కాకూడదనేది పథకం ఉద్దేశం. దీనిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తం బాధ్యత. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు తమ జెండా, ఎజెండాలను పక్కనపెట్టి, డైరెక్ట్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పేరుతో ఫీజురియింబర్స్‌మెంట్ పథకాన్ని తప్పుదారి పట్టించే ప్రభుత్వ నిర్ణయంపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉన్నది. లేకపోతే, భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత విద్య కోర్సులు చదువుకోవడం ఒక కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉన్నది.

# అమెరికాలో ఉండలేం.. ఇండియాకు వస్తాం!



విద్య, ఉద్యోగాల కోసం చాలామంది భారతీయులు అమెరికాకు వెళ్తున్నారు. అమెరికన్ డ్రీమ్, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి సాధించాలనే తపనతో, ఉత్తమ పనితీరు కలిగిన ఐటీ, ఆరోగ్య సంరక్షణ, కార్మిక నిపుణులుగా రాణిస్తున్నారు. విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు హెచ్1బీ వీసాలను ఉపయోగించుకున్నారు. భారతీయ విద్యార్థులు అమెరికాలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలనే కోరికతో ఖర్చుకు వెనుకాడకుండా అక్కడికి వెళ్లాలని ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు సఫలమైతే మరి కొందరు విఫలమవుతున్నారు. కానీ ఇటీవల భారతీయుల్లో అమెరికా కల చెదిరిపోతున్నది. అమెరికాలో ఉండలేమని, ఇండియాకు తిరిగి వస్తామని చాలామంది చెప్తున్నారు. ఎన్నో కష్టానష్టాలను భరించి అమెరికా వెళ్లిన భారతీయులు అక్కడి స్థానికుల నుంచి అవమానాలు, ఆటంకాలను అధిగమించి, మెరుగైన పనితీరుతో రాణిస్తున్నారు. సముచిత స్థానాన్ని సంపాదించుకున్నారు. అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా టెక్నాలజీ, ఫైనాన్స్, తయారీ రంగాల్లోని సంస్థలకు నాయకత్వం వహిస్తున్నారు. భారతీయ సంతతి కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం 119000 అమెరికా డాలర్లు. 2026 నాటికి అమెరికాలో జన్మించిన, అమెరికాకు వలస వెళ్లిన వారు కలిపి 54 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఇది అమెరికా జనాభాలో 1.5%. సంఖ్యాపరంగా, ఆర్థికపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆసియా సమూహాల్లో భారత సంతతి ఒకటి. కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, న్యూయార్క్‌లలో భారత సంతతి ప్రజలెక్కువ. అమెరికాలోని వైద్యుల్లో 10% మంది భారతీయులే. అమెరికాలో మన వాళ్లు ఎంతగా రాణించినప్పటికీ వారు చాలా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. కార్నెగి నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. అమెరికాను వదలాలని అక్కడి భారత సంతతిలోని 40% మంది కోరుకుంటున్నారని అధ్యయనం వెల్లడించింది. ఒకప్పుడు అమెరికాలో ఉద్యోగం సంపాదించడం, స్థిర నివాసం ఏర్పరచుకోవడం చాలామంది కల, కానీ ప్రస్తుతం ఆ కల చెదిరిపోతున్నది. అగ్రరాజ్యంలో ఉండలేని దుస్థితి నెలకొన్నదని భారతీయుల వేదన. అక్కడి పరిస్థితుల కారణంగా రోజురోజుకు వారిలో ఆందోళన, భయం పెరిగి, భారత్‌కు రావాలని కోరుకుంటున్నారు. అక్కడి రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులే కారణమని చెప్తున్నారు. యూగవ్, కార్నెగి ఎండోమెంట్స్ సంస్థ 1,000 మంది భారతీయులను సర్వే చేసి అభిప్రాయం సేకరించగా 40% భారతీయ అమెరికన్లు భారత్ వెళ్లిపోతామని వెల్లడించగా, 14% మంది వెళ్లిపోవాలని తరచుగా ఆలోచిస్తున్నామని, 28% మంది అప్పుడప్పుడు అలా అనిపిస్తుందని చెప్పారు. ప్రస్తు తం అమెరికాలో జరుగుతున్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై అక్కడ ఉన్న భారతీయుల్లో 58% మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పెరిగిన జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నామని 54% మంది తెలిపారు. రోజు రోజుకు వ్యక్తిగత భద్రత కష్టంగా ఉన్నదని 41% చెప్పారు. మొదటిసారి ట్రంప్ అధ్యక్షుడైనప్పుడు అతడు భారతదేశం పట్ల సానుకూలంగా ఉంటారని అక్కడి ఎన్ఆర్ఐలు భావించారు. కానీ రెండోసారి అధ్యక్షుడయ్యాక ఆర్థిక వ్యవస్థ నిర్వహణ, వలస విధానాలు, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రభుత్వ నిర్ణయాలు తమకు నచ్చడం లేదని 71% మంది వెల్లడించారు. ట్రంప్ జాత్యహంకార మాటలు మాట్లాడుతూ, అమెరికన్స్ ఫస్ట్ అంటూ, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అని రకరకాలుగా ప్రకటనలు చేస్తూ అమెరికన్లనే కాకుండా అమెరికాలో స్థిరపడిన, పనిచేస్తున్న, చదువుకుంటున్న విదేశీయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని పలువురు చెప్తున్నారు. ట్రంప్‌కు అమెరికా ప్రజల్లో 38% గా ఉన్న ఆదరణ 30% కి పడిపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇక మరి కొన్ని సంస్థల అధ్యయనంలోనూ (రాయిటర్స్ ఇప్సోస్-35%, ఏపీ-ఎన్‌వోఆర్సీ సెంటర్ ఫర్ పబ్లిక్ అఫైర్స్ రీసెర్చ్-35%, స్టేంత్ ఇన్ నంబర్స్ వెరా సైట్-33%) ట్రంప్‌కు మద్దతు తగ్గుతున్నట్టు వెల్లడయింది. ఇరాన్‌తో యుద్ధం, పడిపోతున్న ఆర్థిక వ్యవస్థల నిర్వహణ, వలసలు వంటి విషయాల్లో ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజామోదం లేదని పైన పేర్కొన్న 3 సంస్థలు తెలిపాయి. ముఖ్యంగా ఆర్థిక విషయాల్లో అమెరికన్లకు అసంతృప్తి అధికంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉన్నదని ఈ వారం ప్రారంభంలో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 70% మంది ప్రజలు తెలిపినట్టు ఏపీ ఎన్‌వోఆర్సీ సంస్థ వెల్లడించింది దేశం సరైన పంథాలో సాగడం లేదని 72% మంది అభిప్రాయపడినట్టు తెలియజేసింది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో మార్చి నెలలో ట్రంప్‌కు ఉన్న ప్రజాదరణ 38%, కానీ ఏప్రిల్ నాటికి అది 30%కు పడిపోయింది. జీవన వ్యయం విషయంలో కేవలం 23% మంది మాత్రమే ట్రంప్‌కు అనుకూల, 76% మంది ట్రంప్‌కు వ్యతిరేక అభిప్రాయం చెప్పారు. వీటికి తోడు ఈ మధ్యనే జార్జియా, ఫ్లోరిడా రాష్ట్రాలలో కార్చిచ్చు కమ్మేసింది. భారత్ నుండి అమెరికా వెళ్లే వారిని అన్ని మాఫియా గ్యాంగ్ స్టర్ల కంటే ఎక్కువ నష్టం చేసి, మనల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చేసి దోచుకొని అమెరికాకు నష్టం కలిగిస్తున్న 'గ్యాంగ్ స్టర్స్ విత్ లాప్టాప్” అని, మైకేల్ శావెజ్ అనే రాజకీయ విశ్లేషకుడు చేసిన పాడ్‌కాస్ట్‌ను ట్రంప్ సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో రీపోస్ట్ చేశారు. దాదాపు 10 నిమిషాల నిడివిగల వీడియోలో జాత్యహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. తమ పిల్లలు అమెరికాలో పుట్టేలా 9 నెలల గర్భంతో ఉన్న వారిని చైనా/ ఇండియా నుంచి అమెరికాకు తీసుకొస్తున్నారు. ఇక్కడ పుట్టి అమెరికా జాతీయ పౌరులైపోతున్నారు. ఇక్కడ పుట్టిన బేబీకి చట్టబద్ధంగా లభించే పౌరసత్వాన్ని ఆధారంగా చేసుకొని తమ మొత్తం కుటుంబాన్ని భారత్/చైనా నుంచో, భూగోళంపైనున్న మరో నరకప్రాయ దేశం నుంచో ఇక్కడికి తెస్తారు. అందుకే అమెరికా బర్త్ రైట్ సిటిజన్‌షిప్‌లో మార్పులు చేయాలి. అమెరికా రాజ్యాంగాన్ని సవరించాలి అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏంటంటే భావప్రకటనా స్వేచ్ఛ ప్రకారం తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెలువరించిన ఒక రాజకీయ విశ్లేషకుని పోస్టును బాధ్యత గల అమెరికా అధ్యక్షుడు రీపోస్ట్ చేయడమంటే ఆ అధ్యక్షుని మదిలో విదేశీయులపై ఉన్న దురభిప్రాయం ఇట్టే తెలిసిపోతుంది. గతంలో నేను భారతీయులకు మద్దతుదారుడుగా ఉండేవాన్ని. అది ఎప్పటివరకంటే శ్వేత జాతీయులకు కాలిఫోర్నియాలో ఉండే హైటెక్ కంపెనీలలో ఒక్క ఉద్యోగం కూడా రావడం లేదని తెలియనంత వరకు. అక్కడ ఉద్యోగం పొందాలంటే భారత్/ చైనా నుంచి వచ్చిన వారై ఉండాలి అనే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఆ కంపెనీల సీఈవోలందరూ కూడా భారత్/చైనా వారే అని ట్రంప్ పేర్కొన్నారు. ఎంతో కష్టపడి ఎన్నో కలలతో అమెరికా వెళ్లిన భారతీయులు ఇలాంటి పరిస్థితులను జీర్ణించుకోలేక చాలామంది స్వదేశానికి తిరిగి రావాలని అనుకుంటున్నారని సర్వేలో తేలింది.

# దిక్కులేని డిక్లరేషన్.. రైతన్న పరేషాన్!

తెలంగాణ ఉద్యమం మొదలయిందే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాల మీద. కాకతీయుల కాలం నుండి హైదరాబాద్ రాష్ట్రం వరకు గొలుసుకట్టు చెరువులు, పలు ప్రాజెక్టులతో సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణ వ్యవసాయ రంగం ఆంధ్రప్రదేశ్ అవతరణతో తిరోగమనం వైపు పయనించింది. అటు గోదావరి, ఇటు కృష్ణా నదులు ప్రవహిస్తున్నా ఎత్తైన ప్రాంతానికి సాగునీరు తరలించడం సాధ్యం కాదంటూ సమైక్య పాలకులు మభ్యపెట్టి తెలంగాణ వ్యవసాయరంగాన్ని క్రమంగా సంక్షోభంలోకి నెట్టారు. దీంతో సాగునీటి కోసం తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణలో దాదాపు 26 లక్షల నుంచి 30 లక్షల మంది రైతులు బోర్ల మీద ఆధారపడి వ్యవసాయం చేసేవారంటే నాటి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇంతచేసినా కరెంటు కోతలు, పంట చేతికి వచ్చిన తర్వాత మద్దతుధర దక్కకపోవడం వంటి సమస్యలతో రైతులు అప్పులపాలయ్యారు. కొందరు ఆత్మహత్యలకు పాల్పడితే, మరికొందరు వలసల బాటపట్టారు.తెలంగాణ వార్తలు 1995 నుంచి 2013 వరకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) రికార్డుల ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో 36,358 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వీరిలో తెలంగాణకు చెందిన వారు దాదాపు 22,000 (60 శాతం) మంది ఉన్నారు. ఇంకా రికార్డుల్లోకి ఎక్కని వారు చాలా ఎక్కువమంది ఉండొచ్చని అంచనా. సమైక్య పాలకుల పాపానికి ఒక్క పాలమూరు జిల్లా నుంచే దాదాపు 14 లక్షల మంది ఉపాధి కోసం వలస వెళ్లే వారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్ష మీద సంపూర్ణ అవగాహన ఉన్న కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి, దేశంలోని అనేక రాజకీయ పార్టీల మద్దతును సాధించి, కుట్రలను ఛేదించి, కేంద్రం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. స్వరాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయరంగమే ప్రాధాన్యత అంశంగా పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయడానికి శ్రీకారం చుట్టారు. గోదావరి మీద కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడున్నరేండ్లలో పూర్తి చేశారు. కృష్ణా నది మీద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టి 90 శాతం పనులతోపాటు, ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. +వశీస్త్రతీఖజూష్ట్రఱఎ =వటవతీవఅఎవ దశాబ్దాల వివక్షతో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న రైతుల్లో ధైర్యాన్ని నింపడానికి ఎకరాకు ఏడాదికి రూ.10 వేల నగదుసాయం అందించే రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. 11 విడతలలో దాదాపు 70 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ.72,815 కోట్లు జమచేశారు. వ్యవసాయాన్ని నమ్ముకుని ప్రపంచానికి అన్నం పెట్టే రైతు ఏ కారణంతో మరణించినా ఆ కుటుంబం రోడ్డున పడకూడదని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి, మరణించిన రైతు కుటుంబానికి 10 రోజుల లోపు రూ.5 లక్షల సాయం అందించేలా రైతుబీమా పథకం ప్రవేశపెట్టారు. ఫలితంగా 1,11,320 రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్ల సాయం అందింది. వ్యవసాయరంగానికి సాగునీరు అందించడమే కాకుండా ఏడాదికి రూ.10,500 కోట్ల సబ్సిడీని భరించి 24 గంటల ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలుచేశారు. పం డిన పంటలను వంద శాతం కొనుగోలు చేశారు. సమైక్యరాష్ట్రంలో అప్పుల బారిన పడిన రైతులను ఆదుకునేందుకు కేసీఆర్ హయాంలో 58.29 లక్షల మంది రైతులకు రూ. 29,144.61 కోట్లు రుణమాఫీ చేశారు. ప్రపంచాన్ని గడగడ వణికించిన కరోనా విపత్తులోనూ రైతుబంధు పథకం కింద సాయం అందించడమే కాకుండా, ఏడు వేల పైచిలుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల కల్లాల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 2014-15లో రూ.1,12,162గా ఉన్న తెలంగాణ తలసరి ఆదాయం 2022 -- 23 వరకు రూ.3,17,115కు పెరిగింది. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కేసీఆర్ తీసుకున్న చర్యలతోనే ఇది సాధ్యమైంది. 2014లో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగువిస్తీర్ణం 2022-23 నాటికి 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది. 2014-15లో 68 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి, 2022 -- 23 నాటికి దాదాపు 3 కోట్ల టన్నులకు చేరింది. ఇవి కాకుండా అందుబాటులో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ విద్యకు ప్రాధాన్యం, 5 వేలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించడం, 2601 రైతు వేదికల నిర్మాణం, 39.01 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యాన్ని, 73.82 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం వంటి అనేక చర్యలు చేపట్టారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా పథకాలను ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) 2018లో ప్రపంచంలోని 20 అత్యున్నత పథకాల్లో వినూత్నమైనవిగా గుర్తించి ప్రశంసలు కురిపించింది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 700 పైచిలుకు పథకాల నుంచి ఎంపికైన 20 పథకాలలో కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా ఉండడం విశేషం.

కేసీఆర్ పాలనలో రైతులు, వ్యవసాయరంగ అభ్యున్నతి కోసం తీసుకున్న చర్యలు, ప్రవేశపెట్టిన పథకాల మీద పక్కా ప్లాన్ ప్రకారం బురదజల్లారు. రైతుబంధు భూస్వాములకు ఇస్తున్నారని, ఏడాదికి మూడు పంటలు పండిస్తుంటే, రెండు పంటలకే రైతుబంధు ఎలా ఇస్తారని, మూడో పంటకు ఎందుకు ఇవ్వరని, చనిపోయిన తర్వాత ఇచ్చే ముష్టి రూ.5 లక్షల రైతుబీమా ఎందుకు అని అవాకులు చెవాకులు పేలారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ 2023 శాసనసభ ఎన్నికల్లో గెలుపుకోసం 2022 మే 6న వరంగల్‌లో రైతు సంఘర్షణ సభ పేరుతో సభ నిర్వహించి రైతు డిక్లరేషన్ ప్రకటించింది. రాహుల్‌గాంధీ హాజరై డిక్లరేషన్ విడుదల చేయడం గమనార్హం. దీనిని 2023 కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2023 డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని, రూ.లక్ష రుణం ఉన్నవారు రూ.లక్ష బ్యాంకులో చెల్లించి, రూ.2 లక్షలు రుణం తీసుకోవాలని రెచ్చగొట్టారు. రైతుబంధు కింద ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు కాదని, రూ.15 వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా పథకం వర్తింపచేస్తామని నమ్మబలికారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీతో ఆశపెట్టారు. అన్ని పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామని, ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని, మిగతా పంటలను కూడా మద్దతు ధరకు మించి రూ.400-రూ.500 ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించారు. పోడు రైతులు, అసైన్డ్ భూముల లబ్దిదారులకు క్రయవిక్రయాలతోపాటు అన్నిరకాల యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ మాటలు నమ్మిన కొందరు రైతులు ఆశపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలను అటకెక్కించింది. అసలు తెలంగాణ వ్యవసాయం, తెలంగాణ రైతులు సమూలంగా నాశనం కావడం కాంగ్రెస్ పాలకుల పాపమే. తెలంగాణ ఉద్యమం మొదలైంది కాంగ్రెస్ పార్టీ వివక్షపూరిత పాలన ఫలితంగానే.

# కొరత లేదంటూనే బ్లాక్?

**కరీంనగర్ :** పశ్చిమాసియా యుద్ధం పేరుతో గ్యాస్ సిలిండర్లపై కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే మోదీ బాదుడుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏకంగా ప్రతినెలా రూ.50 కోట్ల భారం మోయాల్సి వస్తోంది. ఈ విషయంలో కేంద్రం చెబుతున్న మాటలకు, పెంచుతున్న ధరలకు ఏమాత్రం పొంతన ఉండడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గృహావసరాల సిలిండర్లపై ఇటీవల పెంచిన ధరలతో ఇప్పటికే నెలకు దాదాపు రూ.10 కోట్ల భారం మోస్తుండగా, తాజాగా పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు వ్యాపారులకు శరాఘాతంగా మారాయి. కేవలం ఐదు నెలల్లో ఆరు సార్లు పెరగడం ఒక ఎత్తయితే.. 2025 డిసెంబర్‌తో పోల్చి చూస్తే కమర్షియల్ సిలిండర్ ధర అమాంతం రూ.1513 పెరిగింది. ఈ పెంపు వల్ల ఇక నుంచి ప్రతినెలా దాదాపు రూ.40 కోట్ల అదనపు భారం వ్యాపార రంగాలపై పడనున్నది. ఈ భారాన్ని తిరిగి ప్రజలపై వేయడానికి ఆయా హోటళ్లు రెస్టారెంట్లు సిద్ధమవుతున్నాయి. ఇదిలా ఉండగా.. త్వరలోనే డొమెస్టిక్ ధరలు కూడా భారీగా పెరుగుతాయన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం పేరుతో గత మార్చిలో గృహావసరాలకు వినియోగించే సిలిండర్‌పై రూ.60 పెంచిన విషయం తెలిసిందే. అయితే, ఆ తదుపరి కూడా మరోసారి డొమెస్టిక్ సిలిండర్ల ధరలు పెంచే దిశగా కేంద్రం ప్రయత్నాలు ప్రారంభించినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే.. ఐదు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పెంచకుండా ఆపినట్టు తెలుస్తోంది. డొమెస్టిక్ సిలిండర్లపై గ్యాస్ ధరలు పెంచబోమంటూ కేంద్రం ప్రకటనలు ఇస్తున్నా నమ్మశక్యంగా లేవన్న విమర్శలు వస్తున్నాయి. గత మార్చిలో రూ.60 పెంపునకు ముందు కూడా ఇదే విషయం చెప్పింది. కానీ, రాత్రికి రాత్రే అమాంతంగా పెంచింది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం 10,87,360 కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగానికి 14.2 కిలోల సిలిండర్ ధర రూ.925 ఉండగా పెంచిన రూ.60తో కలిపి చూస్తే ఆ ధర రూ.985కి చేరింది. నెలకు ఒక సిలిండర్ చొప్పున బుక్ చేసుకున్నా.. పెరిగిన ధరల ప్రకారం ప్రజలపై నెలకు దాదాపు రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్ల భారం పడుతుంది. అయితే, ఇది ఇక్కడితో ఆగే పరిస్థితి లేదని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా యుద్ధం పూర్తిగా సమసిపోలేదని, అది ఏ రూపంలో అయినా ఉండొచ్చన్న వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు పూర్తయ్యాయి. వాటి ఫలితాలు ఈనెల 4న వెలువడనున్నాయి. ఫలితాలు ఎలా ఉన్నా.. ఆ తదుపరి డొమెస్టిక్ రేట్లు పెరుగుతాయన్న చర్చే ప్రస్తుతం జరుగుతోంది.

**కమర్షియల్‌పై నెలకు రూ.40 కోట్ల భారం**

ఇప్పుడు కమర్షియల్ సిలిండర్ పేరు చెబితే.. వ్యాపారులు బెదిరిపోతున్నారు. ఇంత రేట్లు పెరిగినా సజావుగా లభ్యం కావడం లేదు. అంతా బ్లాక్‌మార్కెట్‌కు తరలుతున్నాయి.



పెరిగిన భారమే భరించలేని పరిస్థితుల్లో ఉంటే.. ఇక మళ్లీ బ్లాక్‌లో ఒక్కో సిలిండర్‌పై రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు అదనపు భారం భరించాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి 2025 డిసెంబర్ 1 నాటికి 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1801.50గా ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కేంద్రం ఆరు సార్లు ఇబ్బడి ముబ్బడిగా ధరలు పెంచింది. 2025 డిసెంబర్‌కు నేటి ధరకు తాజాగా, పెరిగిన రూ.993ను కలుపుకొని మొత్తంగా రూ.1513 పెరగగా, ఒక్కో కమర్షియల్ సిలిండర్ ధర రూ.3,314కు చేరింది. ఉమ్మడి జిల్లాలో 2,62,936 కమర్షియల్ కనెక్షన్లు ఉండగా, తాజాగా ఒక్కో సిలిండర్‌పై పెంచిన భారాన్ని పరిగణలోకి తీసుకొని చూస్తే నెలకు ఒక్కటి బుక్ చేసినా ప్రతినెలా రూ.50 కోట్ల అదనపు భారం పడనుంది. ఈ వ్యవస్థ ఇక్కడితో ఆగడం లేదు. ఇంత పెద్ద మొత్తంలో ధరలు పెంచినా.. డిమాండ్ మేరకు కమర్షియల్ సిలిండర్లు సరఫరా కావడం లేదు. కారణం ఏమిటంటే.. బ్లాక్‌కు తరలుతున్నాయి. అక్కడ ఉన్న ధరపై అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు చెల్లిస్తేనే లభ్యమవుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా పెంచిన రేట్లు ఒకవైపు.. బ్లాక్ మార్కెట్‌లో దోచుకుంటున్నతీరు మరోవైపు కలిపి ప్రస్తుతం వ్యాపార రంగాలకు తీవ్ర ఇబ్బందులను సృష్టిస్తోంది. గత జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు రూ.200 నుంచి రూ.300 వరకు పెంచుతూ వచ్చిన కేంద్రం మే 1న మాత్రం ఏకంగా ఒక్కో సిలిండర్‌పై రూ.993 పెంచడం పెద్ద గుది బండగా మారింది. పెరుగుతున్న కమర్షియల్ ధరలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే పలు రకాల ఫుడ్‌ఐటమ్స్‌పై ధరలు పెంచిన రెస్టారెంట్లు, హోటల్ నిర్వాహకులు ఇప్పుడు మరింత పెంచే దిశగా చూస్తున్నారు. ధరలు పెంచకుండా భారాన్నిమోసే పరిస్థితి తమకు లేదంటున్నారు. ప్రధానంగా చిరు వ్యాపారులపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండే పరిస్థితి కనిపిస్తోంది.

**పొంతన లేని మాటలు**

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై పడకుండా చూసుకుంటున్నామని, గ్యాస్, పెట్రోలు ఉత్పత్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని మోదీ సర్కారు పదే పదే చెబుతూ వచ్చింది. కానీ, ఆచరణలో చూస్తే మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే గృహావసరాలకు సంబంధించిన ఒక్కో సిలిండర్‌పై రూ.60 పెంచిన కేంద్రం మరింత పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. రూ.60 పెరిగిన తర్వాత కూడా గ్యాస్ సరఫరాపై ఆంక్షలు మాత్రం తొలగలేదు. డిమాండ్ మేరకు సరఫరా కావడం లేదు. ఒకవైపు కొరత లేదంటూ చెపుతూనే మరోవైపు ఆంక్షలు కొనసాగిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక కమర్షియల్ సిలిండర్ విషయంలో మాత్రం వ్యాపార వర్గాలకు కేంద్రం షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. రెస్టారెంట్లు, హోటళ్లలో రేట్లు పెంచితే తద్వారా విక్రయాలు తగ్గుతాయని, వచ్చే వినియోగదారుల సంఖ్య తగ్గుతుందని పేర్కొంటున్నారు. పోనీ పెరిగిన ధరలను చూస్తే పెంచక తప్పే పరిస్థితి లేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. నిజానికి గ్యాస్ కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెపుతున్న మోదీ సర్కారు.. ధరలు పెంచుతూ పోవడం వల్ల ఈ భారం తిరిగి ప్రజలపైనే పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆకాశంలో కారు మబ్బులు.. వణుకుతున్న అన్నదాత



**జూలూరుపాడు :** నింగి నిండా కారుమబ్బులు.. వీస్తున్న ఉగ్రరూప వడగాల్పులు.. రోడ్డు మీద మట్టిని రజనులా ఎగరేస్తున్న గాలి దుమారం.. ఇదీ శనివారం మధ్యాహ్నం జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద కనిపించిన భీతావహ దృశ్యం. వర్షం ఇంకా పడలేదు, కానీ పడే సూచనలు స్పష్టంగా కనిపిస్తుండటంతో, చేతికొచ్చిన పంట ఏమైపోతుందోనన్న భయం రైతును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాధారణంగా ఎండకు ఆరబోయాల్సిన మొక్కజొన్నలు ఇప్పుడు దుమ్ము ధూళికి బలవుతున్నాయి. ఒక్కసారిగా వీచిన గాలులకు రోడ్డుపై ఉన్న మట్టి, చెత్తాచెదారం కొనుగోలు కేంద్రంలోని పంటపైకి చేరుతుండటంతో రైతులు హుటాహుటిన పట్టాలు కప్పాల్సి వచ్చింది. గింజ నాణ్యత దెబ్బతింటే కొనుగోలు అధికారులు అభ్యంతరాలు చెబుతారన్న ఆందోళనతో వాన రాకముందే రైతులు నానా యాతన పడుతున్నారు. ఆకాశం వైపు చూస్తూ, "వద్దు నాయనా.. ఇప్పుడే కురవద్దు" అని వేడుకుంటున్న దృశ్యాలు అక్కడి వారిని కలచివేస్తున్నాయి. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే జల్లులు పడడంతో, ఇక్కడ కూడా ఏ క్షణమైనా వాన ముంచెత్తుతుందన్న భయంతో రైతులు పట్టాలను కప్పి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సహకార సంఘం ఆవరణ 5 అడుగుల లోతులో ఉండడం ఇప్పుడు శాపంగా మారింది. వాన పడితే నీరంతా ఇక్కడికే వచ్చి చేరుతుంది. పంట తడవక ముందే తడిసిపోతుందన్న భయం రైతును మానసికంగా కుంగదీస్తోంది. 15 రోజులుగా ధాన్యం ఆరబోసి ఉన్నా లారీలు రాకపోవడంతో ఆ పట్టాల కిందే పడిగాపులు కాస్తూ అన్నదాతలు తమ ప్రాణప్రదమైన పంటను కాపాడుకుంటున్నారు. కేంద్రం ప్రారంభించి 20 రోజులు కావస్తున్నా కేవలం ఒక్క లోడు మాత్రమే వెళ్లడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. తాము ఇక్కడ వానకు, ఎండకు, దుమ్ముకు పడి ఉంటుంటే అధికారులు మాత్రం కదలడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకాశం మేఘావృతమై గాలి దుమారం రేగుతున్నా యంత్రాంగంలో చలనం లేకపోవడం గమనార్హం. ?పంట పండించడం ఒక ఎత్తయితే, దానిని విక్రయించడం మరో యుద్ధంలా మారింది. ప్రకృతి ప్రకోపించక ముందే అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోతే, ఈ లోతట్టు ప్రాంతంలోని మొక్కజొన్న రాశులు నీటి పాలు కాక తప్పదు. అన్నదాత కళ్లల్లో కనిపిస్తున్న ఈ ఆందోళన తీరాలంటే, తక్షణమే లారీలను పంపి ధాన్యాన్ని తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు వేడుకుంటున్నారు.

# కాంగ్రెస్ మోసాన్ని బయటపెట్టడానికే బీఆర్‌ఎస్ రైతు సంగ్రామ సదస్సు

**వరంగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 6న రైతు సంగ్రామ సదస్సు ను నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ వెల్లడించారు. హనుమకొండలోని హంటర్ రోడ్‌లో నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం వరంగల్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 మే 6న వరంగల్‌లో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పేరుతో రైతులకు హామీలు ఇచ్చారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఒక బాధ్యత కలిగిన ప్రతిపక్ష పార్టీగా, కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ మోసాన్ని బయటపెట్టడానికే నిర్వహిస్తున్న వరంగల్ రైతు సంగ్రామ సదస్సును విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వెల్లడించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.



## మే 4, నుండి డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం

మహబూబాబాద్ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్):

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై జిల్లా స్థాయితో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయి (ఆర్డీఓ కార్యాలయాలలో) కూడా నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోనీ మహబూబాబాద్ డివిజన్ (మహబూబాబాద్ పట్టణం, =ఙూ కార్యాలయంలో), తొర్రూరు డివిజన్ (తొర్రూరు =ఙూ కార్యాలయంలో) ఇకపైన ప్రతి సోమవారం ఉదయం 10.30 నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టుగా మరియు ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అన్ని డివిజనల్ స్థాయి విభాగాల డివిజనల్ అధికారులు పాల్గొంటరని తెలిపారు. కావున సంబంధిత డివిజన్ మండల్ ప్రజలు ఆర్డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణిలో వారి దరఖాస్తులను సమర్పించి రసీదు పొందవచ్చు అని అధికారులు చెప్పారు.

## డివిజన్ స్థాయిలలో ప్రజావాణి నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే డివిజన్ స్థాయి ప్రజావాణి**

వరంగల్ జిల్లా, 03 (తీన్మార్ న్యూస్):




ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజావాణి" కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే డివిజన్ స్థాయి ప్రజావాణి ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించడం జరుగు తుందన్నది అందరికీ తెలిసిన విషయమైనప్పటికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు జిల్లా స్థాయిలో. డివిజన్ స్థాయి అధికారులు డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతి వినతికి ప్రత్యేక ధృవీకరణ నంబర్ కేటాయించ బడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ మరియు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజల పట్ల నిబద్ధత తో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రక్టల ద్వారా తెలిపారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలి



హనుమకొండ జిల్లా, మే 03 (తీన్మార్ న్యూస్):

వర్ధన్నపేట నియోజకవర్గంలో మొక్కజొన్న, వరి సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండలోని కుడా సమావేశ మందిరంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్లతో కలిసి సంబంధిత అధికారులతో మొక్కజొన్న, వరి సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాలో ఈసారి మొక్కజొన్నతో దిగుబడులు గణనీయంగా పెరిగినందున, రైతుల ఉత్పత్తులను సకాలంలో సేకరించి సరైన ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తెచ్చే మొక్కజొన్న, వరి ధాన్యాన్ని మార్కెట్ యార్డుల్లోని కవర్ షెడ్లలో భద్రపరచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిల్వ సదుపాయాలు, రవాణా, తూకం, చెల్లింపుల ప్రక్రియలు పారదర్శకంగా, వేగవంతంగా సాగాలని పేర్కొన్నారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, వర్ధన్నపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉంచి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, డీఆర్‌డీఓ మేన శ్రీను, వ్యవసాయ శాఖ అధికారులు, డీసీఓలు,మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులు ఏడీఓలు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిందితులను పట్టుకుంటాం.. కరీంనగర్ సీపీ వెల్లడి

కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షాపులో దోపిడీ కేసు వివరాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మీడియాకు వెల్లడించారు. ఐదుగురు తుపాకులతో ప్రవేశించారని తెలిపారు. బంగారం కొనుగోలు చేస్తున్నట్లు ప్రవర్తించి తుపాకులతో బెదిరించారని పేర్కొన్నారు. వారిలో నలుగురు నాలుగు రౌండ్లు ఫైరింగ్ చేశారని చెప్పారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారని అన్నారు. దోపిడీ తర్వాత వెపన్స్‌ను వారి వెంటనే తీసుకెళ్లారని వివరించారు. ఈ దోపిడీకి సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని సీపీ తెలిపారు. నిందితులను కచ్చితంగా పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా మండిపడ్డారు. 24 గంటల్లోగా

## రెండు వారాల పాటు మైదాను తినడం మానేస్తే

# శరీరంలో జరిగే మార్పులు ఇవే



మైదా (=వటఱఅవఎ ఖీశ్రీశీబతీ) మనకు తెలియకుండానే రోజువారీ ఆహారంలో భాగమైపోయిన పదార్థం. బ్రెడ్, బిస్కెట్లు, నూడుల్స్, కేకులు, పేస్ట్రీలు వంటి అనేక వంటకాలలో దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచిగా ఉన్నప్పటికీ, ఇందులో పోషకాలు తక్కువగా ఉండటం, జీర్ణక్రియపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, ఆరోగ్య నిపుణులు దీనిని పరిమితం చేయాలని సూచిస్తున్నారు. అందుకే కొందరు కొంతకాలం మైదాను పూర్తిగా మానేసి శరీరంలో వచ్చే మార్పులను గమనిస్తున్నారు. కేవలం రెండు వారాల పాటు మైదా తీసుకోకుండా ఉంటే కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

జీర్ణ వ్యవస్థకు..

మైదాను ఆహారం నుంచి తొలగించడంతో జీర్ణక్రియలో మెరుగుదల కనిపిస్తుంది. ఫైబర్ లేని మైదా జీర్ణక్రియను మందగింపజేస్తుంది. దానికి బదులుగా సంపూర్ణ ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకుంటే ఉబ్బరం తగ్గి, పొట్ట తేలికగా అనిపిస్తుంది. అలాగే శక్తి స్థాయిలు స్థిరంగా మారుతాయి. మైదాతో తయారైన పదార్థాలు రక్తంలో చక్కెరను వేగంగా పెంచి, వెంటనే తగ్గిస్తాయి. దీంతో అలసట, నీరసం వస్తాయి. మైదా మానేయడం వల్ల ఈ మార్పులు తగ్గి, శక్తి స్థాయి సంతులితంగా ఉంటుంది. ఆకలి కూడా నియంత్రణలోకి వస్తుంది. మైదా ఎక్కువసేపు తృప్తిని ఇవ్వదు కాబట్టి తరచూ తినాలనిపిస్తుంది. కానీ ఫైబర్, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే ఎక్కువసేపు నిండుగా అనిపించి అనవసరంగా తినడం తగ్గుతుంది. బరువు నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది.

**చర్మ సంరక్షణకు..**

మైదా పదార్థాల్లో ఎక్కువగా ఖాళీ క్యాలరీలు, చక్కెరలు, కొవ్వు ఉంటాయి. వీటిని తగ్గించడం వల్ల అదనపు క్యాలరీలు తగ్గి, కొంతవరకు బరువు నియంత్రణలోకి వస్తుంది. ఉబ్బరం కూడా తగ్గినట్లు అనిపిస్తుంది. చర్మంపై కూడా స్వల్ప మార్పులు కనిపిస్తాయి. ప్రాసెస్డ్ ఆహారం తగ్గించడంతో శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, మొటిమలు లేదా చర్మ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. మైదా మానేసిన మొదటి రోజుల్లో తినాలనే కోరికలు పెరగవచ్చు. ముఖ్యంగా బ్రెడ్, బేకరీ పదార్థాలు ఎక్కువగా తీసుకునే వారికి ఇది సహజమే. అయితే కొద్ది రోజుల్లోనే శరీరం అలవాటు పడడంతో ఈ కోరికలు తగ్గిపోతాయి. మైదా పిండిని మానేయడం వల్ల ఈ విధంగా మన శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**వీటిని తీసుకోవాలి..**

మైదాను మానేటప్పుడు దానికి బదులుగా సంపూర్ణ గోధుమలు, జొన్నలు, రాగులు, ఓట్స్, పప్పులు వంటి పోషకాహారం తీసుకోవడం అవసరం. కేవలం మైదాను మానేయడం సరిపోదు, మొత్తం ఆహార నాణ్యతను మెరుగుపరచడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. రెండు వారాల పాటు మైదాను దూరం పెట్టడం ద్వారా శరీరంలో వచ్చే చిన్న మార్పులను గమనించవచ్చు. ఇది కఠిన నియమం కాదు, కానీ మన ఆహారం శరీరంపై ఎలా ప్రభావం చూపుతుందో అర్థం చేసుకునేందుకు మంచి అవకాశమని నిపుణులు సూచిస్తున్నారు.

# స్ట్రెస్ తగ్గించడానికి తక్షణం చేయగల సులభమైన పద్ధతులు ఏమిటి..?



నిద్రలేమి ఉన్నప్పుడు వెంటనే నిద్ర పట్టడానికి ఏమి చేయాలి? ఆందోళన వచ్చినప్పుడు వెంటనే ఎలా తగ్గించుకోవాలి? ఐదు నిమిషాల్లో మనసును ప్రశాంతంగా చేసుకోవడం ఎలా? శ్వాస వ్యాయామాలు స్ట్రెస్ తగ్గించడంలో ఎలా సహాయపడతాయి? రాత్రి నిద్రకు ముందు చేయాల్సిన అలవాట్లు ఏమిటి? ఎక్కువగా ఆలోచించడం ఎలా తగ్గించాలి?ఫోన్, స్క్రీన్ వాడకం నిద్రపై ఎలా ప్రభావం చూపుతుంది? ధ్యానం వెంటనే రిలాక్స్ కావడానికి సహాయ పడుతుందా? ఆందోళన సమయంలో మనసును మళ్లించడం ఎలా? స్ట్రెస్ ఉన్నప్పుడు ఏ ఆహారం తీసుకోవాలి? నిద్రలేమి సమస్యకు సహజ పరిష్కారాలు ఏమిటి? శరీరం, మనసు రిలాక్స్ కావడానికి బెస్ట్ టెక్నిక్స్ ఏవి? మ్యూజిక్ లేదా సౌండ్స్ స్ట్రెస్ తగ్గించడంలో ఉపయోగ పడతాయా? రోజువారీ జీవితంలో స్ట్రెస్‌ని ఎలా కంట్రోల్ చేయాలి? ఒక్కసారిగా ఆందోళన వచ్చినప్పుడు వెంటనే ఏమి చేయాలి?

రాత్రి పడుకున్న తర్వాత కూడా ఆలోచనలు ఆగకపోతే ఎలా నియంత్రించాలి? స్ట్రెస్ వల్ల శరీరంపై వచ్చే లక్షణాలు ఏమిటి? నిద్రపోవడానికి ముందు ఏవి చేయకూడదు?కాఫీ లేదా టీ ఎక్కువగా తాగితే నిద్రపై ప్రభావం ఉంటుందా? యోగా ద్వారా స్ట్రెస్ తగ్గించుకోవచ్చా? ఏ ఆసనాలు మంచివి? రోజు ఎంతసేపు ధ్యానం చేస్తే మంచి ఫలితం వస్తుంది? పనిలో ఒత్తిడిను ఎలా మేనేజ్ చేయాలి? ఎక్కువగా ఆలోచించడం ఆపడానికి ఏ టెక్నిక్స్ ఉపయోగపడతాయి? ఆందోళన వల్ల గుండె వేగంగా కొట్టుకోవడం సాధారణమేనా?రాత్రి నిద్ర మధ్యలో మేల్కొన్నప్పుడు మళ్లీ నిద్రపోవడానికి ఏమి చేయాలి? మొబైల్ ఫోన్ వాడకం నిద్రలేమికి ఎలా కారణమవుతుంది? స్ట్రెస్ తగ్గించడానికి ఏ పండ్లు, ఆహారం మంచివి? ప్రకృతి దగ్గర గడపడం మానసిక ప్రశాంతతకు ఎలా సహాయపడుతుంది? రోజువారీ వ్యాయామం నిద్రను ఎలా మెరుగుపరుస్తుంది? ఆందోళన ఎక్కువైతే డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలి? మ్యూజిక్ థెరపీ నిజంగా స్ట్రెస్ తగ్గిస్తుందా? డీప్ బ్రీదింగ్ ఎలా చేయాలి? రోజుకు ఎంతసేపు స్క్రీన్ టైమ్ ఉండాలి? నిద్రలేమి వల్ల దీర్ఘకాలంలో వచ్చే సమస్యలు ఏమిటి? స్ట్రెస్ తగ్గించడానికి హాబీలు ఎంతవరకు సహాయపడతాయి? ఉదయం అలవాట్లు మానసిక ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయి? ఆందోళన సమయంలో శరీరాన్ని రిలాక్స్ చేయడానికి ఏమి చేయాలి? నిద్రకు సరైన టైమ్ ఏమిటి?మైండ్ ఫుల్‌నెస్ (ఎఱఅఎటబశ్రీఅవంం) అంటే ఏమిటి? అది ఎలా ఉపయోగపడుతుంది? అనే అంశాలను గురించి ప్రముఖ వైద్యనిపుణులు డా.విక్రాంత్ సింగ్ ఠాకూర్ సాక్షి లైఫ్ కు వివరించారు. ఆ విశేషాలు ఈ కింది వీడియో చూసి తెలుసుకోండి..

# ఆరోగ్యానికి మేలే అయినా..



వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో కొబ్బరి నీళ్లు చాలా మందికి సహజ శీతల పానీయంగా మారుతుంది. అయితే ఇటీవలి కాలంలో ఇది నిజంగా అంత ఉపయోగకరమా? లేక సోషల్ మీడియా ప్రభావంతో అతిగా ప్రాచుర్యం పొందిందా? అనే చర్చ కూడా ఎక్కువగా జరుగుతోంది. దేశంలో చాలా ప్రాంతాల్లో కొబ్బరి నీటిని కేవలం వేసవిలోనే కాకుండా సంవత్సరమంతా తాగుతారు. వీటిలో ఉండే ఎలక్ట్రోలైట్స్ శరీరానికి అవసరమైన ద్రవ సమతౌల్యాన్ని అందించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఇవి కండరాల నొప్పులను తగ్గించడంలో, డీహైడ్రేషన్‌ను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక గ్లాస్ కొబ్బరి నీటిలో ఒక మీడియం సైజు అరటిపండుతో సమానమైన లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో పొటాషియం ఉంటుంది. అదేవిధంగా కొబ్బరి నీటిలో మెగ్నీషియం, కాల్షియం వంటి ఖనిజాలు కూడా కొంతమేర లభిస్తాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయే ఖనిజాలను భర్తీ చేయడంలో సహాయపడతాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇది తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం. సోడాలు, ప్రాసెస్ చేసిన జ్యూస్‌లతో పోలిస్తే ఇందులో చక్కెర శాతం తక్కువగా ఉంటుంది (సుమారు 4-6 శాతం). అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది. అయితే తాజా కొబ్బరి నీరే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్యాకేజ్డ్ రూపంలో వచ్చే కొబ్బరి నీటిలో మైక్రోప్లాస్టిక్స్, ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రుచులు కలిసే అవకాశం ఉండటం వల్ల దాని పోషక విలువలు తగ్గిపోతాయి. అంతేకాకుండా పరిశోధనలు చెబుతున్నట్లు, సాధారణంగా కూర్చునే జీవనశైలి ఉన్నవారికి ఇది సాధారణ నీటితో పోలిస్తే ప్రత్యేక ప్రయోజనం ఇవ్వదు.

సంప్రదాయ పానీయాలను మరువద్దు..

ఇక సంప్రదాయ పానీయాలు కూడా కొబ్బరి నీటికి సమానంగా లేదా మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. చాస్ (మజ్జిగ) ప్రోబయోటిక్ గుణాలు కలిగి ఉండి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సత్తు పానీయం శక్తిని నిలకడగా అందిస్తుంది. బేల్ శర్బత్ వంటి పానీయాలు వేడి వల్ల కలిగే జీర్ణ సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అయితే కొబ్బరి నీటిని అధికంగా తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల హైపర్‌కలీమియా అనే పరిస్థితి ఏర్పడి ప్రాణాపాయం కలిగిస్తుంది. అలాగే ఎక్కువగా తాగితే విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.

ఎంత పరిమాణంలో తాగాలి..

ప్రీ-డయాబెటిస్ ఉన్నవారిలో కొబ్బరినీళ్లు షుగర్ స్థాయిలను పెంచే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. సోడియం తక్కువగా ఉండటం వల్ల కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలున్నవారికి ఇది సరిపోదు. కాబట్టి కొబ్బరి నీటిని సరైన పరిమాణంలో మాత్రమే తీసుకోవడం మంచిది. సాధారణంగా ఆరోగ్యవంతులైన వ్యక్తులు రోజుకు సుమారు 100-150 మిల్లీలీటర్ల వరకు తీసుకోవచ్చు. ఖాళీ కడుపుతో తీసుకుంటే శరీరం దాని పోషకాలను మెరుగ్గా గ్రహిస్తుంది. కొబ్బరి నీరు ఒక సహజమైన, ఆరోగ్యకరమైన పానీయం అయినప్పటికీ ఇది ఏదైనా అద్భుత ఔషధం కాదు. ప్రాసెస్ చేసిన పానీయాలకంటే ఇది మెరుగైనదే కానీ, సాధారణ నీటిని పూర్తిగా భర్తీ చేయదు. ఆర్థికంగా చూస్తే కొంతమందికి ఇది ఖరీదైన ఎంపిక అవుతుంది. అందువల్ల శరీర అవసరాలు, అందుబాటు ఆధారంగా పానీయాలను ఎంచుకోవడం ఉత్తమం. వేసవిలో హైడ్రేషన్ ముఖ్యమని, పానీయం ఏదైనా కావచ్చు, కానీ మితిమీరకుండా తీసుకోవడం మరింత ముఖ్యమైందని నిపుణులు సూచిస్తున్నారు.



## బిజినెస్

### అమ్మకాల్లో హవా.. టీవీఎస్ రికార్డ్!



టీవీఎస్ మోటార్ ఏప్రిల్‌లో 4,73,970 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెలలో అమ్మిన 4,43,716 యూనిట్లతో పోలిస్తే ఇవి 7% అధికంగా ఉన్నాయి. టూ వీలర్స్ మొత్తం విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 6% పెరిగి 4,30,150 నుంచి 4,55,333 యూనిట్లకు చేరాయి. దేశీయ ద్విచక్ర వాహన విక్రయాల్లో 8 శాతం వృద్ధి సాధించింది. గతేడాది ఏప్రిల్‌లో 3,23,647 యూనిట్లుగా ఉన్న అమ్మకాలు, ఈ ఏడాది 3,48,545 యూనిట్లకు చేరాయి. గతేడాది 1,69,741 యూనిట్లుగా ఉన్న స్కూటర్ల విక్రయా లు, ఈసారి 24 శాతం వృద్ధితో 2,11,158 యూనిట్లకు పెరిగాయి. అయితే.. మోటార్‌సైకిళ్ల అమ్మకాల్లో వేగం కొంత తగ్గింది. గత ఏడాది ఏప్రిల్‌లో 2,20,347 యూనిట్లు అమ్ముడవగా, గత నెలలో ఆ సంఖ్య 2,00,039 యూనిట్లకు పరిమితమైంది.

### సాఫ్ట్‌వేర్ రంగంలో 18 ఏళ్ల అనుభవం..
### ఏఐ దెబ్బకి మెక్‌డొనాల్డ్స్‌లో..



సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సంచలనాలు సృష్టిస్తోంది. ఈ ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఏళ్ల అనుభవం ఉండి.. ఏఐ కారణంగా ఉద్యోగం కోల్పోయానంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఏఐ కారణంగా ఎనిమిది నెలల క్రితం తాను ఉద్యోగం కోల్పోయానంటూ ఆ వ్యక్తి తన పోస్టులో పేర్కొన్నాడు. తమ బృందంలో 12 మంది ఐటీ ఉద్యోగులం ఉండేవాళ్లమని, కంపెనీ మా అందరినీ తొలగించి కేవలం ఇద్దరు ఏఐ నిపుణులను నియమించుకుందని తెలిపాడు. 100కు పైగా ఉద్యోగాలకు అప్లై చేసినా జాబ్ దొరకలేదని వెల్లడించాడు. చివరకి కుటుంబ పోషణ కోసం ప్రస్తుతం మెక్‌డొనాల్డ్స్‌లో చేరినట్లు తెలిపాడు. తనకు తెలిసిన అనేక మంది అనుభవజ్ఞులైన ఇంజినీర్లు కూడా ప్రస్తుతం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. వారిలో కొందరు సంబంధంలేని ఉద్యోగాల్లో చేరినట్లు వెల్లడించాడు. ఈ పోస్టు తాజాగా నెట్టింట తీవ్ర చర్చకు దారి తీయగా.. నెటిజన్లు దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆ ఇంజినీర్ ఆవేదనను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా. మరికొందరు అనుభవం ఉన్నవారు ఏఐ సాధనాలు నేర్చుకుంటే.. వారికి డిమాండ్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

# చమురు ఉత్పత్తి పెంపునకు
# ఒపెక్ ఓకే.. కానీ, కాగితాల మీదే!

ఇంటర్నెట్ డెస్క్: జూన్ నెలలో చమురు ఉత్పత్తి కోటాను పెంచేందుకు చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఇరాన్- అమెరికా వ్యవహారం కొలిక్కి రాకపోవడం, హర్మూజ్ జలసంధి ఇంకా తెరుచుకోకపోవడంతో వాస్తవంలో ఒపెక్ం దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే పరిస్థితిలో లేవు. దీంతో ఈ అంగీకారం కేవలం కాగితాలకే పరిమితం కానుంది. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచంలోనే చమురు రవాణాకు అత్యంత కీలక మార్గం 'హర్మూజ్ జలసంధి' మూతపడింది. దీనివల్ల చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా, కువైట్, అల్జీరియా, కజక్‌స్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమై చమురు ఉత్పత్తి పెంపునకు పచ్చజెండా ఊపాయి. రోజుకు 1,88,000 బ్యారెళ్ల మేర చమురు ఉత్పత్తిని పెంచాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ఈ సమాఖ్య నుంచి యూఏఈ వైదొలిగిన సంగతి తెలిసిందే. అంతకుముందు జరిగిన సమావేశంలోనూ చమురు ఉత్పత్తి కోటాను రోజుకు 2,06,000 బ్యారెళ్ల మేర పెంచడానికి ఒపెక్ం అంగీకరించింది. ఇలా ఉత్పత్తి పెంచేందుకు నిర్ణయించడం వరుసగా ఇది మూడోసారి. కాల్పుల విరమణ కొనసాగుతున్నా ఉద్రిక్తతలు సద్దుమణిగితే ఆ మేర ఉత్పత్తి పెంచడం సాధ్యమవుతుంది.



**ఒక్క బ్యారెలూ ఎగుమతి చేయలేదు**

గల్ఫ్ దేశాల్లో ఒకటైన కువైట్ ఏప్రిల్ నెలలో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయలేదని ట్యాంకర్‌ట్రాకర్ వెబ్‌సైట్ పేర్కొంది. 1991 గల్ఫ్ వార్ తర్వాత నెల రోజుల్లో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఎగుమతి చేయకపోవడం ఇదే తొలిసారి అని పేర్కొంది. ఎగుమతిని చేయనప్పటికీ.. ఉత్పత్తి చేసిన క్రూడాయిల్‌ను ఆ దేశం కొంతమేర స్టోరేజీ చేస్తోందని, మరికొంత క్రూడాయిల్‌ను రిఫైన్ ఉత్పత్తులుగా మారుస్తోందని ట్యాంకర్ ట్రాకర్ తెలిపింది.

# డీలాపడ్డ టెక్స్‌టైల్స్ ఎగుమతులు: కారణం ఇదే!

పత్తి వంటి కీలక ఉత్పత్తుల రవాణా (షిప్‌మెంట్‌లు)లో తగ్గుదల కారణంగా టెక్స్‌టైల్స్, గార్మెంట్ ఎగుమతులు 2025--26లో 2.2% తగ్గి 35.8 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) ఈ విషయాలు వెల్లడించింది. రూపాయిపరంగా కూడా గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 2.1% తగ్గాయి. ఆర్థిక సంవత్సరంలో పత్తి టెక్స్‌టైల్స్ (--3.9%), రెడీమేడ్ దుస్తులు (--1.4%), కార్పెట్లు (--5.3%) వంటి ప్రధాన విభాగాల్లో తగ్గుదల ధోరణి కనిపించింది. అయితే హస్తకళల ఎగుమతులు మాత్రం స్వల్పంగా 1.5% పెరిగాయి. "రూపాయి, డాలర్ మారకం వృద్ధిలో వ్యత్యాసం ఒక వ్యవస్థాత్మక సమస్యకు సంకేతం. భారత్ విలువపరంగా ఎక్కువగా ఎగుమతులు చేస్తున్నప్పటికీ, అంతర్జాతీయంగా డాలర్ల రూపంలో తక్కువ ఆదాయం ఆర్జిస్తోంది. ఉదాహరణకు, మ్యాన్--మేడ్ టెక్స్‌టైల్స్ రూపాయి పరంగా 3.6% పెరిగినా, డాలర్ పరంగా 0.8% తగ్గాయి. అలాగే, గార్మెంట్స్ ఎగుమతులు రూపాయి పరంగా 2.9% పెరిగినా, డాలర్ పరంగా 1.4% క్షీణించాయి" అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. కరెన్సీ క్షీణత వల్లే వృద్ధి కనిపిస్తోందే తప్ప పోటీ సామర్థ్యాల వల్ల కాదని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి కీలకమైన గ్లోబల్ మార్కెట్లలో భారత్ విస్తరించలేకపోవడమో, లేదా మార్కెట్ వాటాను కోల్పోవడమో జరుగుతోందని, ముఖ్యంగా కారి?మక శక్తి ఎక్కువగా ఉండే రంగాల్లో ఇది ప్రస్ఫుటంగా ఉంటోందని వివరించారు.




## స్పోర్ట్స్

# అపర కుబేరుడి చేతికి రాజస్థాన్ రాయల్స్..
# రూ.15 వేల కోట్లకు కొనేశాడు..!



ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ మరోసారి చేతులు మారింది. పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందు జైపూర్‌కు చెందిన ఈ ఫ్రాంచైజీని కల్ సొమాని గ్రూప్ కొనుగోలు చేయగా.. ఇప్పుడు బ్రిటన్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు లక్ష్మి మిట్టల్ భారీ ధరకు దక్కించుకున్నాడు. 1.65 బిలియన్ డాలర్లకు (భారతీయ కరెన్సీలో రూ.15,660 కోట్లు) రాజస్థాన్ జట్టును ఈ వ్యాపార దిగ్గజం సొంతం చేసుకున్నాడు. ఐపీఎల్ మధ్యలోనే రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త బాస్ చేతుల్లోకి వెళ్లింది. స్టీల్ వ్యాపారంలో దిగ్గజం లక్ష్మి మిట్టల్ కుటుంబం భారీ ధరకు రాజస్థాన్ యాజమాన్యం హక్కులు సాధించింది. ఫ్రాంచైజీలో 75 శాతం వాటా మిట్టల్ కుటుంబానిది కాగా.. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అడార్ పూనావాలా, మనోజ్ బడాలేలు సహ యజమానులుగా కొనసాగనున్నారు. ఐపీఎల్ ఆరంభ సీజన్ జట్లలో ఒకటైన రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేయడానికి కుటుంబ నేపథ్యమూ ఓ కారణమని లక్ష్మి మిట్టల్ తెలిపాడు. మాది రాజస్థాన్ కుటుంబం. అందుకే రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేశా. స్కూల్లో నేను క్రికెట్ ఆడాను. అప్పటి నుంచి నాకు క్రీడలంటే చాలా ఇష్టం. ఎందరో గొప్ప ఆటగాళ్లు రాజస్థాన్ జెర్సీని ధరించారు. యువతకు స్ఫూర్తిగా నిలిచిన భారత దిగ్గజాలూ రాజస్థాన్‌కు ఆడారు. సో.. నేను ఈ గొప్ప జట్టులో భాగం కావాలనుకున్నా. స్టేడియంలో మ్యాచ్ చూస్తూ అభిమానులతో కలిసి రాజస్థాన్ విజయాన్ని కాంక్షించేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నా అని లక్ష్మి మిట్టల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పంతొమ్మిదో సీజన్‌కు ముందే రాజస్థాన్ ఫ్రాంచైజీ వేలంలో భారీ ధర పలికింది. బ్రిటన్‌కు చెందిన కల్ సొమనీ నాయకత్వంలోని సంఘం.. రాబ్ వాల్టన్(వాల్‌మార్ట్), ది హంప్ (ఫోర్డ్) కుటుంబాలు రాజస్థాన్ జట్టును హస్తగతం చేసుకున్నాయి. అయితే.. సీజన్ మధ్యలోనే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ లక్ష్మి మిట్టల్ కుటుంబం అత్యధిక వాటాను కొనుగోలు చేసింది. 75 శాతం వాటాలో మిట్టల్ ఫ్యామిలీ ఫ్రాంచైజీలో పెద్దన్నలా వ్యవహరించనుంది. అడార్ పునావాలా 18 శాతం, మిగిలిన ఏడు శాతం వాటా మనోజ్ బడలే పేరున ఉంది.

### సునీల్ నరైన్ సరికొత్త చరిత్ర




కేకేఆర్ స్టార్ స్పిన్నర్ సునీల్ నరైన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో 200 వికెట్లు తీసిన తొలి విదేశీ బౌలర్‌గా, ఓవరాల్‌గా మూడో బౌలగా రికార్డు నెలకొల్పాడు. ఒకే ఫ్రాంచైజీ తరఫున ఈ ఘనత సాధించిన ఏకైక బౌలర్‌గానూ రికార్డుల్లోకెక్కాడు. నరైన్ తన ఐపీఎల్ కెరీర్ ప్రారంభం నుంచి (2012) కేకేఆర్‌కు మాత్రమే ఆడాడు. ఐపీఎల్‌లో 200 వికెట్లు తీసిన మిగతా ఇ?ద్దరు బౌలర్లు చహల్ (228), భువనేశ్వర్ కుమార్ (215) ఒకటికి మించి ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహించారు. నరైన్ తన 197 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్‌లో ఓ 5 వికెట్ల ప్రదర్శన, ఏడు 4 వికెట్ల ప్రదర్శనల సాయంతో 201 వికెట్లు తీశాడు. నరైన్ ఎకానమీ (6.79) టాప్-2 బౌలర్లు చహల్ (8.02), భువీ (7.68) కంటే తక్కువ ఉండటం? మరో రికార్డు. ఐపీఎల్ 2026లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఇవాళ్టి (మే 3) మధ్యాహ్నం మ్యాచ్‌లో నరైన్ ఈ చారిత్రక మైలురాయిని అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో నరైన్ 4 ఓవర్లలో 31 పరుగులకు 2 వికెట్లు తీశాడు. తొలుత తీసిన సలీల్ అరోరా వికెట్ నరైన్‌కు డబుల్ సెంచరీ వికెట్. ఆతర్వాత అతను కీలకమైన ఇషాన్ కిషన్ వికెట్ కూడా తీసి సన్‌రైజర్స్‌ను భారీ దెబ్బ కొట్టాడు. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తున్న సన్‌రైజర్స్ కేకేఆర్ బౌలర్ల ధాటికి 17.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది. నరైన్‌తో పాటు వరుణ్ చక్రవర్తి (4-0-36-3), వైభవ్ ఆరోరా (2.3-0-23-1) కార్తీక్ త్యాగి (3-0-24-1), గ్రీన్ (3-0-34-1), అనుకూల్ రాయ్ (1-0-8-1) సన్‌రైజర్స్‌ను ఇబ్బంది పెట్టారు. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో ట్రవిస్ హెడ్ (61) అర్ధ సెంచరీతో సత్తా చాటగా.. ఇషాన్ కిషన్ (42) రాణించాడు. మిగతా ఆటగాళ్లలో అభిషేక్ శర్మ 15, క్లాసెన్ 11, స్మరణ్ రవిచంద్రన్ 4, అనికేత్ వర్మ 6, సలీల్ అరోరా 2, కమిన్స్ 10, శివాంగ్ కుమార్ 1 పరుగుకు ఔటయ్యారు. హర్షల్ పటేల్ 1, ఎషాన్ మలింగ 1 పరుగుతో క్రీజ్‌లో ఉన్నారు.

### చరిత్ర సృష్టించిన సీఎస్‌కే చిచ్చర పిడుగు



ఐపీఎల్-2026లో చెన్నై సూపర్ కింగ్స్ యువ ఆటగాడు కార్తీక్ శర్మ ఎట్టకేలకు తన బ్యాట్ ఝుళిపించాడు. ఈ ధనాధన్ లీగ్‌లో భాగంగా శనివారం చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కార్తీక్ అద్భుతమైన హాఫ్ సెంచరీతో మెరిశాడు. 160 పరుగుల లక్ష్య చేధనలో అతడు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. మొత్తంగా 40 బంతులు ఎదుర్కొన్న కార్తీక్.. 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ క్రమంలో కార్తీక్ శర్మ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్‌పై సీఎస్‌కే తరఫున హాఫ్ సెంచరీ సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా కార్తీక్ నిలిచాడు. కార్తీక్ కేవలం 20 ఏళ్ల 6 రోజుల్లో ఈ ఫీట్‌ను సాధించాడు. ఓవరాల్‌గా ముంబైపై తక్కువ వయసులో 50కు పైగా పరుగులు చేసిన జాబితాలో కార్తీక్ మూడో స్థానంలో నిలిచాడు. తొలి రెండు స్థానాల్లో సంజూ శాంసన్, శుభ్‌మన్ గిల్ ఉన్నారు. కాగా గతేడాది జరిగిన మినీ వేలంలో కార్తీక్ శర్మను రూ.14 కోట్ల భారీ ధరకు సీఎస్‌కే కొనుగోలు చేసింది. అయితే సీజన్ ఆరంభ మ్యాచ్‌లలో అతడు రాణించకపోవడంతో ఫ్యాన్స్ విమర్శించారు. కానీ ఇప్పుడు తనలోని అసలైన ఆటను కార్తీక్ బయటపెట్టాడు.



# యశ్‌తో బోల్డ్ సీన్స్.. తొలగించాలంటూ హీరోయిన్ రిక్వెస్ట్!

కేజీయఫ్ 2 లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత కన్నడ స్టార్ యశ్ నటించిన పాన్ వరల్డ్ చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చిలోనే విడుదల కావాల్సింది. కానీ చివరి నిమిషంలో జూన్ 4వ తేదికి వాయిదా వేశారు. ఇప్పుడు జూన్‌లో కూడా ఈ చిత్రం విడుదల కావడం లేదు. సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చిందని..ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. సినిమా ప్రమోషన్స్ కోసమే వాయిదా వేస్తున్నట్లు యశ్ ప్రకటించారు. కొత్త తేదిని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ గాసిప్ నెట్టింట వైరల్ అవుతుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. చిత్రబృందానికి వింత విజ్ఞప్తి చేసిందట. షూటింగ్ సమయంలో కథ డిమాండ్ మేరకు యశ్, కియారాల మధ్య కొన్ని బోల్డ్ సీన్లు చిత్రీకరించారట. ఇలాంటి సన్నివేశాలు ఉంటాయని కియారాకి ముందే చెప్పారట. ఆమె అన్నింటికి ఒప్పుకొనే సినిమాకు సైన్ చేసిందట. ఇష్టంతోనే బోల్డ్ సీన్లు చేసినప్పటికీ.. ఫైనల్ కట్ చూసి ఇప్పుడు ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. బోల్డ్ సీన్లు తెరపై మరింత ఘటూగా ఉన్నాయని..వాటిని అలాగే చూపిస్తే తన ఇమేజ్‌పై ప్రభావం పడుతుందని భయపడుతుందట. అందుకే వాటిని తొలగించడా లేదా నిడివి తగ్గించే ప్రయత్నం చేయమని దర్శకురాలికి రిక్వెస్ట్ చేసినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే ఆయా సన్నివేశాలు కథకి చాలా కీలకమని..వాటిని తొలగిస్తే సినిమాలోని భావోద్వేగ తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారట. మరి కియారా రిక్వెస్ట్ మేరకు ఆ సీన్లను తొలగిస్తారా లేదా అలానే ఉంచుతారా అనేది తెలియాలంటే రిలీజ్ వరకు ఎదురు చూడాల్సిందే.

# పూజా కార్యక్రమాలతో మొదలైన గోపీచంద్ కొత్త సినిమా.. వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్!



యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ చిత్రాన్ని ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వెంకట్, ఒక గ్రిప్పింగ్ మరియు రూటెడ్ కథతో ఈ సినిమాను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి టాలీవుడ్ టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. సామ్ సి.ఎస్ (ఝఎ జూ) సంగీతాన్ని అందిస్తుండగా, శామ్‌దత్ ఐఎస్‌సి ఛాయాగ్రహణం బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ 'భరత వర్ష' అనే పీరియడ్ చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# గ్లామర్ పాత్రలకు బ్రేక్ .. శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు



టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది. ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించిన శ్రీలీల, "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనుకుంటున్నాను" అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపింది. శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడుతుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూపించాలని ఉన్న ఆమె తపనను అభిమానులు స్వాగతిస్తున్నారు.కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది.



# ఓటీటీకి డెకాయిట్ మూవీ..

అడివి శేష్ హీరోగా షానిల్ డియో తెరకెక్కించిన యాక్షన్ మూవీ 'డెకాయిట్'. సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఇక ఈ మూవీని ఏప్రిల్ 10న రిలీజ్ చేశారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పరంగా ?అదరగొట్టింది. తొలిరోజే రూ. 15 కోట్లతో రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాకుండా కేవలం మూడు రోజుల్లోనే రూ.34.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. ?అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సినిమా అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీ తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. కాగా.. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు.

# బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్.. కానీ ప్రియుడి పేరు మాత్రం సీక్రెట్‌గానే..!



భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్– అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. "అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను" అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. "ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది. అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. "పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అనిపిస్తోంది" అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు. మొత్తానికి, గత ప్రేమ విఫలమైనా ముందుకు సాగుతూ కొత్త జీవితాన్ని ఆహ్వానిస్తున్న అక్షరా సింగ్ నిర్ణయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ అమ్మడు తన లవ్‌కి సంబంధించిన పూర్తి విషయాలు ఎప్పుడు బయట పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ 'భరతనాట్యం 2: మోహినియాట్టం'



మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్థలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. క్రైమ్ కామెడీ మరియు ఫ్యామిలీ డ్రామా కలయికతో రూపొందిన ఈ మూవీ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463